
ఎలమంచిలి పట్టణంలో కురుస్తున్న వర్షం


పరవాడ మండలం ముత్యాలమ్మపాలెం వద్ద తీరానికి చేర్చిన పడవలు

హడలెత్తిస్తున్న తుఫాన్

ఈదురు గాలులతో భారీ వర్షాలు

- వాతావరణ శాఖ హెచ్చరికలతో ప్రభుత్వ యంత్రాంగం అప్రమత్తం
- కలెక్టరేట్‌లో కంట్రోల్ రూమ్
- అందుబాటులో 08924-222888, 08924-225999, 08924-226599 ఫోన్ నంబర్లు
- తుఫాన్‌తో వరి రైతుల్లో ఆందోళన

అనకాపల్లి, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి-న్యూస్ నెట్‌వర్క్): బంగాళాఖాతంలో ఏర్పడిన 'మొంథా' తుఫాన్ తీవ్రరూపం దాలుస్తుందన్న వాతావరణ శాఖ హెచ్చరికలతో ప్రభుత్వ యంత్రాంగం అప్రమత్తమైంది. అనకాపల్లి జిల్లాకు ప్రత్యేక అధికారిగా రాష్ట్ర ప్రభుత్వం నియమించిన సీనియర్ ఐఏఎస్ అధికారి వినయ్‌చంద్ తుఫాన్ పరిస్థితులపై సోమవారం కలెక్టరేట్‌లో అధికారులతో సమీక్ష నిర్వహించారు. జిల్లాలో భారీ వర్షాలు కురుస్తుండడంతో లోతట్టు, సముద్ర తీర ప్రాంతాల ప్రజలకు సహాయక చర్యలు చేపట్టేందుకు సిద్ధంగా ఉండాలని ఆదేశించారు. రాగల మూడు రోజుల్లో కుంభవృష్టిగా వర్షాలు, ఈదురు గాలులు వీచే అవకాశం ఉందన్న వాతావరణ శాఖ హెచ్చరికలతో ముందస్తు చర్యలు చేపట్టాలని చెప్పారు. ఎటువంటి విపత్కర పరిస్థితులనైనా ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉండాలని అధికారులను సూచించారు. పోలీసు, రెవెన్యూ, పంచాయతీరాజ్ శాఖల సిబ్బంది గ్రామాల్లో ప్రజలకు అందుబాటులో వుండాలని చెప్పారు.

అల్లకల్లోలంగా సముద్రం

తుఫాన్ కారణంగా పరవాడ, అచ్యుతాపురం, రాంబిల్లి, ఎస్.రాయవరం, నక్కపల్లి, పాయకరావుపేట మండలాల్లో సముద్రం అల్లకల్లోలంగా మారింది. సాధారణ రోజులతో పోలిస్తే అలలు ఒక మీటరు ఎత్తు వరకు అదనంగా ఎగిసిపడుతున్నాయి. తుఫాన్ హెచ్చరికలతో మత్స్యకారులు ఆదివారం సాయంత్రానికి పడవలు, తెప్పలను తీరంలో సురక్షిత ప్రదేశానికి చేర్చారు. సముద్ర తీరంలోని అన్ని పర్యాటక ప్రదేశాలను పోలీసులు మూసివేయడంతో సందర్శకులు ఎవరూ రాలేదు.

లోతట్టు ప్రాంతాల్లోని పంట పొలాలు నీటమునిగాయి. రహదారులపై వర్షం నీరు ప్రవహించి వాగులను తలపిం చాయి.


అచ్యుతాపురం మండలం పూడిమడక వద్ద ముందుకు వచ్చిన సముద్రం

ఇప్పటికే దెబ్బతిన్న రోడ్లు మరింత అధ్వానంగా తయారయ్యాయి. గోతుల్లో నీరు చేరి చెరవుల్లా దర్శనమిస్తున్నాయి. వర్షంతోపాటు రోడ్డు బాగోకపోవడంతో వాహనాలు నెమ్మదిగా ప్రయాణించాల్సి వస్తున్నది.

జిల్లాలోని అన్ని జలాశయాల్లో నీటినిల్వలు ఇప్పటికే గరిష్ఠస్థాయికి చేరగా, తుఫాన్ నేపథ్యంలో ముందు జాగ్రత్త చర్యగా అధికారులు స్పిల్‌వే గేట్లు ఎత్తారు. రిజర్వాయర్లలోకి వచ్చే వరదకన్నా ఎక్కువ నీటిని దిగువకు విడుదల చేసున్నారు. దీంతో నదులు, గెడ్డలు, వాగుల్లో వరద ఉధృతి పెరిగింది. చెరువులు పూర్తిగా నిండి పొర్లుకట్టల మీదుగా నీరు బయటకు పోతున్నది.

వరి రైతుల్లో ఆందోళన

జిల్లాలో ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌లో 54,465 హెక్టార్లలో వరి సాగు చేపట్టారు. ప్రస్తుతం పొట్ట, గింజపాలు పోసుకునే దశల్లో పంట వుంది. తుఫాన్ కారణంగా భారీ వర్షాలు కురిసి, ఈదురు గాలులు వీస్తే.. వరిపైరు నేలవాలి నీటమునుగుతుందని రైతులు ఆందోళన చెందుతున్నారు.

కలెక్టరేట్‌లో కంట్రోల్ రూమ్....

తుఫాన్ కారణంగా ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు ఎదురైనా తక్షణ సహాయక చర్యలు అందించేందుకు కలెక్టరేట్‌లో కంట్రోల్ రూమ్‌ను ఏర్పాటు చేశారు. ఇంకా డివిజన్, మండల కేంద్రాల్లో కూడా కంట్రోల్ రూమ్‌లను ఏర్పాటు చేశారు. కలెక్టరేట్ కంట్రోల్ రూమ్‌లో 08924-222888, 08924-225999, 08924-226599 ఫోన్ నంబర్లను అందుబాటులో వుంచి, 24 గంటలూ సిబ్బంది వుండేలాఏర్పాట్లు చేశారు. అదే విధంగా విద్యుత్ సరఫరాలో ఎటువంటి ఇబ్బందులు ఎదురైనా తక్షణ చర్యలు చేపట్టేందుకు కంట్రోల్ రూమ్‌లను ఏర్పాటు

... మిగతా 8వ పేజీలో


చోడవరంలో పొట్ట దశలో ఉన్న వరిపైరు

ఆందోళనలో అన్నదాతలు

తుఫాన్‌తో వరిపైరుకు నష్టం వాటిల్లుతుందని గుబులు

- పొలాల్లో మూడు రోజులకు మించి అధికంగా నీరు నిల్వ ఉంటే దిగుబడిపై ప్రభావం
- కూరగాయలు, అపరాల పంటలకూ నష్టం

చోడవరం, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): బంగాళాఖాతంలో ఏర్పడిన 'మొంథా' తుఫాన్ ప్రభావంతో భారీ వర్షాలు మొదలవ్వడం, తుఫాన్ తీరానికి దగ్గరవుతున్నకొద్దీ ఈదురు గాలులు పెరుగుతుండడంతో అన్నదాతలు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. భారీ వర్షాలు కురిసి పంటలు మునిగిపోతే పూర్తిగా నష్టపోతామని వాపోతున్నారు. ఖరీఫ్ వరి పంట ఇప్పుడు పొట్ట, గింజ పాలుపోసుకునే దశల్లో ఉంది. ముందుగా నాట్లు వేసిన ప్రాంతాల్లో గింజ కడుతున్నది. ఈ పరిస్థితుల్లో రెండు, మూడు రోజులకు మించి పొలాల్లో అధిక నీరు వుంటే ధాన్యం దిగుబడిపై తీవ్రం ప్రభావం చూపుతుందని రైతులు అంటున్నారు. సోమవారం సాయంత్రం వరకు మోస్తరు వర్షం పడడంతో పొలాలు ఎక్కడా ముంపునకు గురికాలేదు. అయితే రాత్రి నుంచి భారీ వర్షం కురిస్తే అవకాశం వుండడంతో రైతులలో గుబులు చెందుతున్నారు. మురుగునీటి పారుదల వ్యవస్థ బాగున్నచోట ఇబ్బంది లేదని, డ్రైనేజీ కాలువల నిర్వహణ సరిగాలేని ప్రాంతాలు, లోతట్టు భూముల్లో వరద ముంపు తప్పదని అంటున్నారు. ఇదే సమయంలో పెద్దేరు, రైవాడ, కోనాం, కల్యాణపులోవ జలాశయాల నుంచి పెద్ద మొత్తంలో వరద నీటిని విడుదల చేస్తే మాడుగుల, చోడవరం, అనకాపల్లి, ఎలమంచిలి నియోజకవర్గాల్లోని పలు మండలాల్లో వరిపొలాలు మునగడం ఖాయమని ఆందోళన చెందుతున్నారు.

వరితోపాటు కూరగాయలు, అపరాల పంటలను తుఫాన్ దెబ్బతీస్తుందని అంటున్నారు. కార్తీక మాసంలో కూరగాయలకు వుండే గిరాకీని దృష్టిలో పెట్టుకుని రైతులు ఆగస్టు, సెప్టెంబరు నెలల్లో విత్తనాలు వేయడం, నారునాటడం వంటి పనులు చేస్తుంటారు. ఆయా పంటలు ప్రస్తుతం కాపు దశలో వున్నాయి. ఇప్పుడు భారీ వర్షాలు కురిస్తే పొలాలు నీట మునిగి మొక్కలు కుళ్లిపోయి చనిపోతాయని రైతులు వాపోతున్నారు.

జలాశయాల్లోకి వరద


రైవాడ జలాశయం నుంచి శారదా నదిలోకి విడుదలవుతున్న నీరు

- ముందు జాగ్రత్తగా గేట్లు ఎత్తిన అధికారులు

అనకాపల్లి, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): తుఫాన్ ప్రభావంతో ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న భారీ వర్షాలతో జిల్లాలోని జలాశయాలకు వదద నీరు పోటెత్తుతున్నది. తాండవ, పెద్దేరు, కోనాం, రైవాడ, జలాశయాల నీటి మట్టాలు పెరగుతుండడంతో జలవనరుల శాఖ అధికారులు అప్రమత్తమయ్యారు. మంగళ, బుధవారాల్లో కుభవృష్టిగా వర్షాలు కురిసే అవకాశం వుండడంతో ముందుజాగ్రత్త చర్యగా జలాశయాల్లోకి వచ్చే వరద కంటే.. స్పిల్‌వే గేట్ల ద్వారా ఎక్కువ నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. పెద్దేరు జలాశయం నుంచి 500 క్యూసెక్కులు, తాండవ నుంచి 937 క్యూసెక్కులు, రైవాడ నుంచి 1,500 క్యూసెక్కులు, కల్యాణపులోవ నుంచి 250 క్యూసెక్కులు, కోనాం జలాశయం నుంచి 450 క్యూసెక్కుల నీటిని ఆయా నదుల్లోకి విడుదల చేస్తున్నారు. ఎగువ నుంచి వరద ప్రవాహం పెరిగితే అవుట్‌ఫ్లోను మరింత పెంచుతామని జలవనరుల శాఖ అధికారులు చెబుతున్నారు.

74 పునరావాస కేంద్రాలు

అనకాపల్లి, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో 34 తుఫాన్ ప్రభావిత గ్రామాలను గుర్తించి 74 పునరావస కేంద్రాలను అధికారులు ఏర్పాటు చేశారు. పాయకరావుపేటలో 11, నక్కపల్లిలో 10, రాంబిల్లిలో 5, ఎస్.రాయవరంలో 5, చోడవరంలో 4, రావికమతంలో 4, పరవాడలో 3, మునగపాకలో 3, నర్సీపట్నంలో 3, కోటవురట్లలో 3, నబ్బవరంలో 2, మాడుగులలో 2, చీడికాడలో 2, కశింకోటలో 2, దేవరాపల్లిలో 2, అచ్యుతాపురంలో 2, నాతవరంలో 2, కె.కోటపాడులో 2, బుచ్చెయ్యపేటలో 2, రోలుగుంటలో 1, గొలుగొండలో 1, మాకవరపాలెంలో 1, ఎలమంచిలిలో 1, అనకాపల్లి ఒక కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ఆ కేంద్రాల్లో సిబ్బందిని నియమించి మంగళవారం నుంచి భోజనం, వసతి కల్పించేందుకు ఏర్పాట్లు చేశారు. కలెక్టర్ విజయకృష్ణన్, ఎస్పీ తుహిన్ సిన్హా సోమవారం సాయంత్రం పరవాడ మండలం ముత్యాలమ్మపాలెంలో ఏర్పాటు చేసిన పునరావస కేంద్రాన్ని సందర్శించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. సాయంత్రం నుంచి వర్షం మరింత ఎక్కువైంది. జిల్లాలో ఎటువంటి ప్రాణ, ఆస్తి నష్టం నమోదు కాలేదని కలెక్టర్ విజయకృష్ణన్ తెలిపారు. పునరావస కేంద్రాలకు మూడు రోజులకు సరిపడ ఆహార దినుసులను తరలిస్తున్నట్టు చెప్పారు.


సత్యవరంలో తమలపాకు తోటల రైతులకు సూచనలు ఇస్తున్న ఉద్యాన శాఖ అధికారి సాయిప్రియ

తమలపాకు తోటలకు తుఫాన్ ముప్పు

- ఈదురు గాలులకు నేలకొరుగుతాయని సాగుదారుల ఆందోళన
- అరటి తోటలకూ ఇదే పరిస్థితి

పాయకరావుపేట రూరల్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): తుఫాన్ కారణంగా భారీ వర్షాలు, ఈదురు గాలులు వీస్తాయన్న వాతావరణ శాఖ హెచ్చరికలతో మండలంలోని తమలపాకు, అరటి తోటల రైతులు ఆందోళన చెందుతున్నారు. ఈదురు గాలులకు ఈ తోటలు నేలకొరిగే ప్రమాదం వుండడంతో తీవ్రంగా నష్టపోతామని వాపోతున్నారు. మండలంలోని సత్యవరం, మాసాహెబ్‌పేట, మంగవరం, అరట్లకోట, కొత్తూరు, శ్రీరాంపురం తదితర గ్రామాల్లో సుమారు 1,000 ఎకరాల్లో తమలపాకుల తోటలు వున్నాయి. రైతులతోపాటు వందలాది మంది కూలీలు ఈ తోటలపై ఆధారపడి జీవిస్తున్నారు. ఎకరా తమలపాకు సాగుకు సుమారు లక్ష రూపాయల వరకు పెట్టుబడి అవుతుంది. తుఫాన్ గాలులకు తోటలు నేలకొరిగితే లక్ష రూపాయల మేర నష్టపోతామని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తమలపాకు తోటలకు బీమా సదుపాయం లేకపోవడంతో ఒక్క రూపాయి కూడా తిరిగి రాదని అంటున్నారు. కాగా తుఫాన్ నేపథ్యంలో మండల ఇన్‌చార్జి

... మిగతా 8వ పేజీలో

సహాయక చర్యల్లో నిర్లక్ష్యం వద్దు

తుఫాన్ తీవ్రత అధికంగా ఉండొచ్చు

- ముంపు ప్రాంతాల ప్రజలను సురక్షిత ప్రదేశాలకు తరలించండి
- విద్యా సంస్థల భవనాల్లో తాత్కాలిక షెల్టర్లు
- ఆహారం, నీరు, మందులు సిద్ధంగా ఉంచాలి
- అధికారులకు జిల్లా ప్రత్యేక అధికారి వినయ్‌చంద్ ఆదేశం


సమావేశంలో మాట్లాడుతున్న ప్రత్యేక అధికారి వినయ్‌చంద్. పక్కన కలెక్టర్ విజయకృష్ణన్, ఎస్పీ తుహిన్ సిన్హా


సమావేశానికి హాజరైన వివిధ శాఖల అధికారులు

అనకాపల్లి, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): 'మొంథా' తుఫాన్ తీవ్రత ఎక్కువగా ఉండే అవకాశం ఉన్నందున ప్రజలకు సహాయక చర్యలు అందించడంలో అశ్రద్ధ చేయవద్దని జిల్లా ప్రత్యేకాధికారి, ఆర్థిక శాఖ కార్యదర్శి వినయ్‌చంద్ అధికారులను ఆదేశించారు. ఆయన సోమవారం కలెక్టర్ విజయకృష్ణన్, ఎస్పీ తుహిన్ సిన్హాతో కలిసి కలెక్టరేట్‌లో పలు శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. తుఫాన్ ముందస్తు చర్యలపై వారిలో చర్చించి దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా వినయ్‌చంద్ మాట్లాడుతూ, సహాయక చర్యలు అందించడంలో నిర్లక్ష్యం చేస్తే సహించేది లేదని, సముద్ర తీర గ్రామాలు, నదుల పక్కన వున్న గ్రామాల ప్రజలను సురక్షిత ప్రదేశాలకు తరలించాలని ఆదేశించారు. జిల్లాలో గుర్తించిన 125 లోతట్టు గ్రామాలను మ్యాపింగ్ చేసి, సచివాలయ సిబ్బందిని నియమించాలన్నారు. సమీపంలోని విద్యా సంస్థల భవనాలను తుఫాన్ షెల్టర్లుగా వినియోగించాలని సూచించారు. శిథిలావస్థలో ఉన్న భవనాల్లో నివసిస్తున్న వారిని అత్యవసరంగా సురక్షిత ప్రదేశానికి తరలించాలన్నారు. తాత్కాలిక పునరావాస కేంద్రాల్లో ఆహారం, నీరు, మందులు సిద్ధంగా ఉంచాలని, విద్యుత్ సరఫరాకు అంతరాయం లేకుండా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు

... మిగతా 8వ పేజీలో

శైవక్షేత్రాల్లో కార్తీక సందడి


అనకాపల్లి కాశీవిశ్వేశ్వరుని ఆలయంలో ధ్వజస్తంభం వద్ద దీపారాధన చేస్తున్న భక్తులు

కార్తీకమాసం తొలి సోమవారం జిల్లాలోని శైవ క్షేత్రాలు శివ నామస్మరణతో మార్మోగాయి. ఆయా ఆలయాల్లో తెల్లవారుజామున అర్చకులు ప్రత్యేక పూజలు, పంచామృత అభిషేకాలు నిర్వహించారు. అనంతరం భక్తులు పెద్ద సంఖ్యలో ఆలయాలకు తరలివచ్చి పూజలు, ధ్వజస్తంభాల వద్ద దీపారాధన చేశారు.

నేడు భారీగా రైళ్లు రద్దు

- జాబితాలో 'ప్రశాంతి', 'విశాఖ', తిరుపతి-విశాఖ స్పెషల్, పలు పాసింజర్ రైళ్లు
- రేపు కూడా కొన్ని...
- మరికొన్ని దారిమళ్లింపు, గమ్యాల కుదింపు



విశాఖపట్నం, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): తుఫాన్ నేపథ్యంలో వాల్తేరు రైల్వే డివిజన్ అధికారులు ఈ నెల 28, 29 (మంగళ, బుధవారాలు) తేదీల్లో పలు రైళ్లను రద్దు చేశారు. మంగళవారం రద్దయిన రైళ్లు: విశాఖ-కిరండూల్ నైట్ ఎక్స్‌ప్రెస్ (18516), విశాఖ-కిరండూల్ పాసింజర్ (585801), కిరండూల్-విశాఖ పాసింజర్ (58502), విశాఖ-కొరాపుట్ పాసింజర్ (58538), కొరాపుట్-విశాఖ పాసింజర్ (58537), కొరాపుట్-విశాఖ ఎక్స్‌ప్రెస్ (18511), రాజమండ్రి-విశాఖ మెము పాసింజర్ (67285), విశాఖ-రాజమండ్రి మెము (67286), విశాఖ-కాకినాడ (17268), కాకినాడ-విశాఖ (17267), తిరుపతి-విశాఖ ప్రత్యేక రైలు (08584), విశాఖ-గుంటూరు డబుల్ డెక్కర్ ఉదయ్ ఎక్స్‌ప్రెస్ (22875), గుంటూరు-విశాఖ డబుల్ డెక్కర్ ఉదయ్ ఎక్స్‌ప్రెస్ (22876), బ్రహ్మపూర్-విశాఖ ఎక్స్‌ప్రెస్ (18525), విశాఖ-పలాస మెము (67289), పలాస-విశాఖ మెము (67290), విజయనగరం-విశాఖ మెము (67288), కటక్-గుణుపూర్ మెము (68433), బ్రహ్మపూర్-విశాఖ పాసింజర్ (58531), విశాఖ-బ్రహ్మపూర్ పాసింజర్ (58532), విశాఖ-గుణుపూర్ పాసింజర్ (58506), గుణుపూర్-విశాఖ పాసింజర్ (58505), మహబూబ్‌నగర్-విశాఖ ఎక్స్‌ప్రెస్ (12862), భువనేశ్వర్-బెంగళూరు ప్రశాంతి (18463), భువనేశ్వర్-సికింద్రాబాద్ విశాఖ ఎక్స్‌ప్రెస్ (17015), భువనేశ్వర్-పాండిచ్చేరి ఎక్స్‌ప్రెస్ (20851)

బుధవారం రద్దయిన రైళ్లు: గుణుపూర్-కటక్ మెము (68434), న్యూఢిల్లీ-విశాఖ ఏపీ ఎక్స్‌ప్రెస్ (20806), విశాఖ-ఎల్‌టీటీ ఎక్స్‌పెస్ (18520)

ఇక టాటానగర్-ఎర్నాకులం ఎక్స్‌ప్రెస్ (18189)ను మంగళవారం దారిమళ్లించి టిట్లాగర్, రాయపూర్, నాగపూర్, బలార్ష మీదుగా నడపనున్నారు. అలాగే భువనేశ్వర్-జగదల్‌పూర్ హిరాఖండ్ ఎక్స్‌ప్రెస్ (18447), రూర్కెలా-జగదల్‌పూర్ ఎక్స్‌ప్రెస్‌లు (18107) రాయగడ వరకు నడిచేలా గమ్యాలను కుదించారు.

సోమవారం యథావిధిగా బయలుదేరిన రైళ్లు

తుఫాన్ హెచ్చరికల నేపథ్యంలో ముందస్తు చర్యల్లో భాగంగా సోమవారం రద్దు చేసిన రైళ్లను తిరిగి పునరుద్ధరించామని రైల్వే అధికారులు ప్రకటించారు. విశాఖ-తిరుపతి స్పెషల్ (08583), విశాఖ-తిరుపతి డబుల్ డెక్కర్ (22707), విశాఖ-మచిలీపట్నం (17220),విశాఖ-హైదరాబాద్ గోదావరి ఎక్స్‌ప్రెస్ (12727), విశాఖ- మహబూబ్‌నగర్ ఎక్స్‌ప్రెస్ (12861), విశాఖ-చెన్నై సెంట్రల్ (22869), విశాఖ-సికింద్రాబాద్ గరీబ్‌రథ్ (12739), విశాఖ-న్యూఢిల్లీ ఏపీ ఎక్స్‌ప్రెస్ (20806), విశాఖ-ఎల్‌టీటీ ఎక్స్‌ప్రెస్ (18519) వంటి ఒరిజినేటింగ్ రైళ్లతోపాటు గుంటూరు-రాయగడ ఎక్స్‌ప్రెస్ (17243), రాయగడ-గుంటూరు ఎక్స్‌ప్రెస్ (17244) సోమవారం యథావిధిగా ఒరిజినేటింగ్ స్టేషన్ల నుంచి బయలుదేరాయి.

తీరంలో అలజడి

తుఫాన్‌తో ఎగిసిపడుతున్న కెరటాలు

- వణికిన మత్స్యకారులు
- దూర ప్రాంతాలకు పడవలు, వలలు తరలింపు
- పర్యటించిన ఎమ్మెల్యే సుందరపు, అధికారులు



పాయకరావుపేటరూరల్: రత్నయ్యమ్మపేట తీరంలో ఎగిసిపడుతున్న అలలు

పాయకరావుపేట రూరల్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్‌తో సముద్రం అల్లకల్లోలంగా ఉంది. కెరటాలు ఉవ్వెత్తున ఎగిసిపడుతున్నాయి. మండలంలో పెంటకోట, రాజవరం, గజపతినగరం, వెంకటనగరం, రాజానగరం, పాల్మన్‌పేట, రత్నయ్యమ్మపేట తదితర తీర ప్రాంత గ్రామాలలోని మత్స్యకారులు సముద్రంలో వేటకు వెళ్లవద్దని అధికారులు ముందుగానే హెచ్చరికలు జారీ చేశారు. దీంతో మత్స్యకారులు ఎవ్వరూ వేటకు వెళ్లలేదు. తీరంలో ఉన్న తెప్పలు కొట్టుకుపోకుండా జాలర్లు జాగ్రత్త పరిచారు. పోలీసులు, మెరైన్ పోలీసులు సముద్ర తీరంలోకి ఎవ్వరూ వెళ్లకుండా ప్రజలను అప్రమత్తం చేశారు. సముద్ర తీరాన్ని పరిశీలించారు.

అచ్యుతాపురంలో..

మొంథా తుఫాన్ పూడిమడక మత్స్యకారుల వెన్నులో వణుకు పుట్టించింది. సాధారణంగా మత్స్యకారులు తుఫాన్‌లను పెద్దగా పట్టించుకోరు. తుఫాన్ సమయాల్లో కూడా వీరు చేపల వేటకు వెళతారు. అటువంటిది మొంథా ఉధృతికి మత్స్యకారులు భయపడిపోయారు. అధికారులు హెచ్చరించడంతో ఆదివారం మత్స్యకారులెవరూ చేపల వేటకు వెళ్లలేదు. రాత్రంతా తీరం సాధారణంగానే ఉంది. దీంతో సోమవారం ఉదయం చేపల వేటకు వెళ్దామని కొందరు మత్స్యకారులు భావించారు కాని సోమవారం ఉదయానికి తీరం అలల్లో అలజడి కనబడడంతో భయపడి మత్స్యకారులు చేపల వేటకు వెళ్లలేదు. సోమవారం మధ్యాహ్నానికి ఉలల ఉధృతి మరింతగా పెరిగింది. దీంతో మత్స్యకారులు తమ పడవలను తీరం నుంచి దూర ప్రాంతాలకు తరలించారు. సోమవారం రాత్రికి పరిస్థితి ఇబ్బందిగా ఉండే అవకాశం ఉందని మత్స్యకారులు తెలిపారు. కాగా, పూడిమడక తీరంలో ఎమ్మెల్యే సుందరపు విజయ కుమార్ పర్యటించారు. మత్స్యకారులంతా అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అలాగే ఏ సహాయమైనా చేయడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందని తెలిపారు. తంతడి వాడపాలెం తీరంలో మండల ప్రత్యేకాధికారి నరసింహారావు, తహశీల్దార్ సత్యనారాయణ, ఎంపీడీఓ చిన్నారావు తుఫాన్ రక్షిత భవనాన్ని సిద్ధం చేయించారు. అవసరమైతే కమ్మల పాకల్లో ఉన్నవారిని తుఫాను షెల్టర్‌లోకి తరలించి భోజన ఏర్పాట్లు చేయాలని అధికారులు సూచించారు.

ఎలమంచిలిలో..

మొంథా తుఫాన్ నేపథ్యంలో ఎలమంచిలిలో సోమవారం ఉదయం నుంచి వర్షం కురుస్తూనే ఉంది. ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా అధికార యంత్రాంగం ముందస్తు చర్యలు తీసుకుంటోంది. జంపపాలెం గ్రామాన్ని తహశీల్దారు వరహాలు, రెవెన్యూ సిబ్బంది సందర్శించి శారదానది



ఎలమంచిలి: జంపపాలెం వరహానది పరివాహక ప్రాంతాన్ని పరిశీలించిన తహశీల్దారు వరహాలు

ప్రాంతాన్ని పరిశీలించారు. నది సమీపంలో నివసిస్తున్న గ్రామస్థులకు హెచ్చరికలు జారీ చేశారు. స్థానిక రెవెన్యూ సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. తహశీల్దారు కార్యాలయంలో ఎంపీడీఓ, ఇతర అధికార యంత్రాంగంతో కలిసి సమీక్ష నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ కేఎస్. కొండలరావు, తదితర అధికారులు పాల్గొన్నారు.

రాంబిల్లిలో..

తుఫాన్ ప్రభావంతో సోమవారం ఉదయం నుంచి వర్షాలు జోరుగా కురుస్తున్నాయి. గ్రామాల్లోని ప్రజలు ఇళ్ల నుంచి బయటకు రావడం లేదు. నిత్యం వాహనాల రాకపోకలతో రద్దీగా ఉండే ప్రధాన రోడ్లు, జంక్షన్‌లు నిర్మానుష్యంగా మారిపోయాయి. చెరువులు, పంటపొలాలు, కాలువల్లో వర్షం నీరు చేరింది. ప్రధానంగా కొత్తూరు, నారాయణపుం వద్ద గల మేజర్, మైనర్ శారదా నదులు జోరుగా ప్రవహిస్తున్నాయి. నదుల గట్లు బలహీనంగా ఉండడంతో ఏ సమయంలో ఏ ప్రమాదం సంభవిస్తుందోనని పరిసర గ్రామాల ప్రజలు భయాందోళన చెందుతున్నారు. కొత్తపట్నం, వాడనర్సాపురం, వాడపాలెం, లోవపాలెం, వెంకయ్యపాలెంల్లోని మత్స్యకారులు పడవలు, వలలను సురక్షిత ప్రాంతాలకు తరలించారు. మరోపక్క గ్రామాల్లో విద్యుత్ లేకపోవడంతో ఇళ్లలోని వారు ఇబ్బందులకు గురయ్యారు. తహశీల్దార్, శ్రీనివాసరావు, ఎంపీడీవో జయమాధవి, పలు శాఖల అధికారులు గ్రామాల్లో పర్యటించి ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు.



నక్కపల్లి: తుఫాన్‌షెల్టర్‌ను పరిశీలిస్తున్న అధికారులు

కోటవురట్లలో..

మొంథా తుఫాన్ ప్రభావంతో సోమవారం ఉదయం నుంచి వర్షం కురుస్తోంది. మధ్యాహ్నం మూడు గంటల నుంచి భారీ వర్షం కురవడంతో ప్రజలు ఇళ్లలో నుంచి బయటరాకపోయారు. ఈ వర్షానికి రోడ్లన్నీ జలమయమయ్యాయి.



అచ్యుతాపురం: పూడిమడకలో ఇళ్ల వద్దకు తీసుకువెళ్లిన పడవలు

మొక్కజొన్న, వరి, చెరకు, పత్తి పంటలకు తీవ్రనష్టం వాటిల్లితుందని రైతులు ఆందోళన చెందుతున్నారు. మండలంలో తిమ్మాపురం, కెవెంకటాపురం, లింగాపురం, కోటవురట్ల, కొడవటిపూడి గ్రామాల్లో పత్తి పంట పొలాల్లోనే తడిసి ముద్దయింది. పత్తి ఏరేందుకుగాను అవకాశం లేకపోవడంతో రైతులు లబోదిబోమంటున్నారు. మండలంలో చినబొడ్డేపల్లి ఎస్సీ కాలనీ లో నివాసం ఉంటున్న 17 కుటుంబాలను సురక్షిత ప్రాంతానికి తహశీల్దార్ తిరుమలరావు, ఎంపీడీవో చంద్రశేఖర్, డిప్యూటీ ఎంపీడీవో కూర్మారావు తరలించారు. ఆయా కుటుంబాలకు రేషన్ అందజేశారు.

ఎస్.రాయవరంలో..

తుఫాన్ కారణంగా మండలంలోని పలు గ్రామాల్లో అధికారులు ముందస్తు చర్యలు చేపట్టారు. తుఫాన్ ప్రభావిత ప్రాంతాలుగా రేవుపోలవరం, కొత్త రేవుపోలవరం, బంగారమ్మపాలెం, గుడివాడ, చినఉప్పలం తదితర గ్రామాలను అధికారులు గుర్తించారు. తహశీల్దార్ రమేశ్‌బాబు, ఎంపీడీవో మీనాకుమారి ఆదివారం ఉదయం నుంచి పలు గ్రామాల్లో పర్యటించి ప్రజలకు తుఫాన్ కారణంగా తీసుకోవల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. రేవుపోలవరం, బంగారమ్మపాలెం గ్రామాల్లో వారు పర్యటించి, మత్సకారులను అప్రమత్తం చేసారు. ఈ సందర్భంగా తహశీల్దార్ మాట్లాడుతూ ఈదురు గాలులతో పాటు భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందన్నారు. వరహానది సమీప ప్రాంతాల్లో ఉన్న ప్రజలను కూడా అధికారులు అప్రమత్తం చేశారు. అధికారులతో పాటు టీడీపీ మండల అధ్యక్షుడు అమలకంటి అబద్ధం, పీఏసీఎస్ ఛైర్‌పర్సన్ తుమ్మపాల నాగేశ్వరరావు, ఎంపీటీసీ సభ్యుడు మాధవ్, తెలుగు యువత అధ్యక్షుడు కోడ లోవరాజు పాల్గొన్నారు.

నక్కపల్లిలో

మొంథా తుఫాన్ ప్రభావంతో సోమవారం ఉదయం నుంచి మండలంలో కొండపోతగా వర్షం కురుస్తోంది. తహశీల్దార్ కార్యాలయంలో తుఫాన్ కంట్రోల్ రూమ్ ఏర్పాటుచేశారు. తీరగ్రామాలలో సోమవారం ఉదయం తహశీల్దార్ నరసింహమూర్తి, ఎంపీడీవో సీతారామరాజు పర్యటించారు. కొంతమందిని తుఫాన్ రక్షిత భవనాల్లోకి తీసుకురావాలని గ్రామస్థాయి అధికారులను ఆదేశించారు. రాజయ్యపేట, అమలాపురం, గ్రామాలలో తుఫాన్ షెల్టర్లను పరిశీలించి, అక్కడ అన్ని సదుపాయాలను ఏర్పాటుచేశారు. భోజన సదుపాయం కూడా ఏర్పాటు చేస్తామని తహశీల్దార్ చెప్పారు. సోమవారం సాయంత్రం ఆరు గంటల నుంచి మండలంలోని గ్రామాల్లో భారీ వర్షం కురిసింది.



ఎస్.రాయవరం: రేవుపోలవరం తీరంతో స్థానికులతో మాట్లాడుతున్న తహశీల్దార్ రమేష్‌బాబు

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

- ఎలమంచిలి ఎమ్మెల్యే విజయకుమార్



నారాయణపురం వద్ద మైనర్ శారదా నదిని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్

రాంబిల్లి, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్ కారణంగా ప్రజలు మరింత అప్రమత్తంగా ఉండాలని ఎలమంచిలి ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్ అన్నారు. సోమవారం ఆయన నారాయణపురం, మురకాడ, కట్టుబోలు, మర్రిపాలెం గ్రామాలను పర్యటించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో సమస్యలను అడిగి తెలుసుకున్నారు. నారాయణపురం వద్ద జోరుగా ప్రవహిస్తున్న మైనర్ శారదా నదిని, గట్టును పరిశీలించి, సంబంధిత అధికారులతో మాట్లాడారు. దెబ్బతిన్న కల్వర్టులు, బలహీనంగా ఉన్న మేజర్, మైనర్ శారదా నదుల గట్లను పటిష్టపరిచాలని అధికారులను ఆదేశించారు. వర్షాలకు విరిగిపడే చెట్లను వెనువెంటనే తొలగించేందుకు యంత్రాలను అందుబాటులో ఉంచుకోవాలన్నారు. కార్యక్రమంలో టీడీపీ మండల మాజీ అధ్యక్షుడు వి.దిన్‌బాబు, జనసేన నేత బద్ది మహేష్, తహశీల్దార్ శ్రీనివాసరావు, ఎంపీడీవో జయమాధవి, అధికారులు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

పునరావాస కేంద్రాలను సందర్శించిన ఆర్డీవో



పాయకరావుపేట గరల్స్ హైస్కూల్‌లో పునరావాస కేంద్రంలో ఏర్పాట్లు పరిశీలిస్తున్న ఆర్‌డిఒ వీవీ.రమణ,

పాయకరావుపేట/రూరల్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్ నేపథ్యంలో పలు గ్రామాలలో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాలను సోమవారం నర్సీపట్నం ఆర్డీవో వీవీ రమణ పరిశీలించారు. పట్టణంలోని పాండురంగా దేవస్థానం, ఇందిరా కాలనీలోని గవర్నమెంట్ హైస్కూల్, కనోస్సా ఇంగ్లీషు మీడియం స్కూల్ సమయమంతుల హైస్కూల్, గరల్స్ హైస్కూల్, వెంకటనగరం తదతర గ్రామాలలోని పునరావాస కేంద్రాలను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా పునరావాస ఏర్పాట్లను గురించి అధికారులను అడిగి తెలుసుకున్నారు. గ్రామాలలో రెవెన్యూ, పంచాయతీ, హెల్త్ తదితర సిబ్బందిని అప్రమత్తంగా ఉంచినట్లు తహశీల్దారు మహేశ్వరరావు తెలిపారు. ప్రజలను పునరావాస కేంద్రాలకు తరలించి భోజనాలు ఏర్పాటు చేయాలన్నారు. కార్యక్రమంలో సీఐ జి. అప్పన్న, మండల విద్యాశాఖాధికారి రమేశ్, తదితరులు పాల్గొన్నారు.

శివాలయాలకు పోటెత్తిన భక్తులు



మునగపాక: వాడ్రాపల్లిలో స్వయంభూ శివలింగానికి అభిషేకం చేస్తున్న ఎమ్మెల్యే విజయకుమార్



పాయకరావుపేట రూరల్: పెద్దిపాలెం శివాలయంలో స్వామి వారిని దర్శించుకుంటున్న భక్తులు



ఎస్.రాయవరం బుర్రేశ్వరస్వామి ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు

మునగపాక, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): కార్తీకమాసం తొలి సోమవారం కావడంతో శివాలయాలకు భక్తులు పోటెత్తారు. మండలంలో వాడ్రాపల్లి దక్షిణేశ్వరస్వామిని ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్ సోమవారం దర్శించుకున్నారు. మునగపాకలో కాశీవిశ్వేశ్వరస్వామి (లింగరాయి), సాంబమూర్తి దేవస్థానం, నాగులాపల్లిలో పర్వతవర్ధని సమేత రామలింగేశ్వరస్వామి, శివాలయం, టి.సిరసపల్లిలో వీరభద్రస్వామి ఆలయాలకు భక్తులు పెద్ద ఎత్తున తరలి వచ్చారు. వెంకటాపురం గ్రామంలో నీలకంఠేశ్వరస్వామి ఆలయంలో తుఫాన్‌లో నిత్యాన్నదానం కార్యక్రమాన్ని కొనసాగించారు. మహిళలు కార్తీకమాసం వ్రత పూజలు చేశారు. ఎమ్మెల్యే విజయకుమార్ వెంట కూటమి నాయకులు దొడ్డి శ్రీనివాసరావు, టెక్కలి పరశురాం, దాడి ముసిలినాయుడు, నర్సింగరావు, దశావతారం, బీవీ.రమణ, పరమేశ్వరరావు, ఆడారి గణేష్ తదితరులు పాల్గొన్నారు.

రాంబిల్లిలో..

కార్తీక మహోత్సవాల్లో భాగంగా తొలి సోమవారం ప్రముఖ శైవక్షేత్రం పంచదార్ల భక్తుల శివనామ స్మరణలో మార్మోగింది. వేకుజాము నుంచి భక్తులు ఉమాధర్మలింగేశ్వరస్వామివారిని దర్శించి, పూజలు చేశారు. ఆలయ అర్చకులు స్వామివారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. అనంతరం రాధామాధవస్వామి, సహస్రలింగేశ్వరస్వామి, ద్విముఖ వినాయకస్వామి, సాయిబాబాలను భక్తులు దర్శించి పూజలు చేశారు. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా ఎండోమెంట్ అధికారులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ఆలయం ప్రాంగణంలో తాగునీరు, వైద్యసదుపాయాలు ఏర్పాటు చేశారు. లాలంకోడూరు, కొత్తూరు, దిమిలి, వెల్చూరు, కొత్తపట్నం శివాలయాలను భక్తులు దర్శించి పూజలు చేశారు.

పాయకరావుపేట/రూరల్‌లో..

కార్తీక మాసం తొలి సోమవారం మండలంలోని శివాలయాలకు భక్తులు పోటెత్తారు. పట్టణంలోని లింగాల కాలనీ, బృందావనం, సత్యవరం, గోపాలపట్నం సీతమ్మవారం కొండ, పెద్దిపాలెం, గోపాలపట్నం, పెంటకోట, రాజగోపాలపురం నామవరం, తదితర గ్రామాలలోని శివాలయాలకు సోమవారం తెల్లవారుజాము నుంచే భక్తులు భారీగా తరలిరావడంతో శివాలయాలు కిటకిటలాడాయి. భక్తులు స్వామి వారిని దర్శించుకుని అభిషేకాలు, పూజలు నిర్వహించారు. గోపాలపట్నం సీతమ్మవారి కొండపైన, పెద్దిపాలెం శివాలయాల్లో అన్నసమారాధన చేశారు.

ఎలమంచిలిలో..

కార్తీక మాసం తొలి సోమవారం ఎలమంచిలి పట్టణంతో పాటు మండలంలోని అన్ని గ్రామాల్లోని శైవక్షేత్రాలు భక్తులతో కిటకిటలాడాయి. పట్టణంలోని కొత్తపేట రామలింగేశ్వరస్వామి ఆలయం, శేషుగెడ్డ శివాలయం, త్రిమూర్తులు స్వామి, కొత్తపాలెం, సోమలింగపాలెం, కొక్కిరాపల్లి, యర్రవరం, పెదపల్లి వార్డులతో పాటు, ఏటికొప్పాక, పులపర్తి, పీఎస్‌ఆర్ పేట, తదితర పలు గ్రామాల్లోని శివాలయాలకు తెల్లవారు నుంచే పెద్ద సంఖ్యలో భక్తులు చేరుకుని ప్రత్యేక పూజలు చేశారు. కొత్తపేట రామలింగేశ్వర స్వామి ఆలయంలో అర్చకుడు వంశీ పాలాభిషేకం, తదితర అభిషేకాలు నిర్వహించారు.

ఎస్.రాయవరంలో..

కార్తీక మాసాన్ని పురస్కరించుకొని కార్తీక తొలి సోమవారం మండలంలోని పలు గ్రామాల్లో ఉన్న శివాలయాలు శివనామ స్మరణతో మార్మోగాయి. వేకువజాము నుంచి ఎస్.రాయవరం, గెడ్డపాలెం, పెదఉప్పలం, పెదగుమ్ములూరు, సర్వసిద్ధి, దార్లపూడి, పెనుగొల్లు తదితర గ్రామాల్లో ఉన్న శివాలయాలకు పెద్దఎత్తున భక్తులు అభిషేకాలు, పూజలు చేశారు. భక్తులతో కిటకిటలాడడంతో ఆధ్యాత్మిక శోభ సంతరించుకొంది.

అచ్యుతాపురంలో..

కార్తీకమాసం తొలి సోమవారం మండలంలో శివాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. అచ్యుతాపురంలో కాశీవిశ్వేశ్వరస్వామి, నునపర్తి శిద్ధాశ్రమంలో శివాలయం, మడుతూరులో చౌడేశ్వర స్వామి, దోసూరులో సోమేశ్వరస్వామి, కొండకర్ల, పెదపాడు, ఎంజేపురంలో గల శివాలయాలు భక్తులతో రద్దీగా కనిపించాయి. ఉదయం నుంచి వర్షం కురుస్తున్నప్పటికీ భక్తులు శివాలయాలకు వచ్చి పూజలు నిర్వహించారు.

నక్కపల్లిలో..

కార్తీకమాసం తొలి సోమవారం మండలంలోని ఉపమాక శివాలయం భక్తులతో కళకళలాడింది. తెల్లవారుజామున ముక్కంటికి అర్చకులు పంచామృత అభిషేకం చేసి అనంతరం భక్తుల దర్శనాలకు అనుమతించారు. ఉపమాక దేవస్థానం మాజీ ఛైర్మన్ కొప్పిశెట్టి బుజ్జి ఆధ్వర్యంలో ఆలయంలో విస్తృత ఏర్పాట్లు చేశారు. ఆలయానికి తరలివచ్చిన భక్తులకు అన్న ప్రసాదాలు పంపిణీ చేశారు.



నక్కపల్లి: ఉపమాక శివాలయంలో భక్తులకు దర్శనమిస్తున్న పరమేశ్వరుడు



ఎలమంచిలి కొత్తపేట రామిలింగేశ్వర స్వామి ఆలయంలో పాలాభిషేకం చేస్తున్న అర్చకుడు

మత్స్యకారులకు అండగా ఉంటా..

- బీసీవై పార్టీ అధినేత రామచంద్ర యాదవ్



రాజయ్యపేటలో మాట్లాడుతున్న బీసీవై పార్టీ అధినేత రామచంద్ర యాదవ్

నక్కపల్లి, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): బీసీవై పార్టీ అధినేత రామచంద్ర యాదవ్ సోమవారం ఉదయం మండలంలోని రాజయ్యపేట గ్రామానికి చేరుకున్నారు. కోర్టు ఆదేశాలతో ఆయన రాజయ్యపేట గ్రామానికి వెళ్లారు. గ్రామానికి వచ్చిన రామచంద్ర యాదవ్‌కు మత్స్యకారులు, యాదవ సంఘం ప్రతినిధులు స్వాగతం పలికారు. తరువాత గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. అనంతరం రామచంద్ర యాదవ్ మత్స్యకారులను ఉద్దేశించి మాట్లాడుతూ మత్స్యకారుల ఆందోళనను ప్రభుత్వం పట్టించుకోకపోవడం దారుణమన్నారు. మత్స్యకారులపై పాలకులు చిన్న చూపుతో అనేక సమస్యలు వస్తున్నాయన్నారు. ఇప్పటికే రసాయనిక పరిశ్రమల కారణంగా తీరాన్ని నమ్ముకొని చేపల వేట సాగిస్తున్న మత్స్యకారుల జీవనోపాధి దెబ్బతిందని తెలిపారు. బల్క్ డ్రగ్ పార్కును రద్దు చేసే వరకు తన సహకారం ఉంటుందని రామచంద్ర యాదవ్ మత్స్యకారులకు హామీ ఇచ్చారు.

అర్బన్ ఏరియాగా ఎలా పరిగణిస్తారు

- సీపీఎం నాయకుడు లోకనాథం



సదస్సులో మాట్లాడుతున్న సీపీఎం నాయకుడు లోకనాథం

మునగపాక, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): అనకాపల్లి బైపాస్ మొదలుకొని అచ్యుతాపురం వరకు గ్రామీణ ప్రాంతంలో ఉన్న రోడ్డు మార్గాన్ని అర్బన్ ఏరియాగా ఎలా పరిగణిస్తారని సీపీఎం నాయకుడు లోకనాథం ప్రశ్నించారు. స్థానిక సహకార సంఘం ఫంక్షన్ హాలులో సోమవారం నిర్వహించిన సదస్సులో ఆయన మాట్లాడారు. టీడీఆర్ బాండ్ల విధానానికి స్వస్తి పలికి నగదు చెల్లించాలన్నారు. ఈ సమావేశంలో కర్రి అప్పారావు, సదాశివ, ఎస్.బ్రహ్మాజీ పాల్గొన్నారు.

105 మందికి వైద్య పరీక్షలు



వాడ్రాపల్లి శిబిరంలో వైద్య సేవలందించిన వైద్యులు

మునగపాక, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): మండలంలో వాడ్రాపల్లిలో సోమవారం ఉచిత వైద్య శిబిరంలో 105 మందికి వైద్య సేవలను అందించారు. పెదరామాలయం వద్ద తెలుగు రైతు జిల్లా ప్రధానకార్యదర్శి మళ్ల వరహానర్సింగరావు ఆధ్వర్యంలో జరిగిన వైద్య శిబిరంలో వైద్యులు అమృతలక్ష్మి, జ్ఞానదీపిక, లక్ష్మి, తదితరులు వైద్య పరీక్షలు నిర్వహించారు. రోగులకు మందులను ఉచితంగా అందజేశారు. ఈ కార్యక్రమంలో మళ్ల మణి, లీలాభాస్కర్, ఆడారి బాలాజీ,మళ్ల శంకర్, కొణతాల శివరామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



మంత్రి లోకేశ్ దృష్టికి బ్రాండిక్స్ సమస్యలు : దొరస్వామి

అచ్యుతాపురం, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): తమ కర్మాగారం కీలక అంశాలను మంత్రి లోకేశ్ దృష్టికి తీసుకువెళ్లామని బ్రాండిక్స్ భారత భాగస్వామి పీసీ దొరస్వామి తెలిపారు. సోమవారం ఆయన మంత్రి లోకేశ్‌ని మర్యాద పూర్వకంగా కలిసి వినతిపత్రం ఇచ్చారు. అనంతరం ప్రస్తుతం నెలకొన్న పరిస్థితులను వివరించారు. దేశవ్యాప్తంగా దుస్తుల తయారీ రంగం తీవ్రమైన ఇబ్బందులు ఎదుర్కొంటోందన్నారు. ట్రంప్ విధించిన అదనపు టారిఫ్‌లు బ్రాండిక్స్ ఇండియా సంస్థను తీవ్రంగా దెబ్బతీశాయన్నారు. వర్క్ ఆర్డర్లు లేకపోవడంతో కొన్ని సందర్భాల్లో ఉద్యోగులకు సెలవులు ప్రకటిస్తూ.. వారి ఉద్యోగ భద్రతకు ఎటువంటి ఢోకా ఉండదని భరోసా ఇస్తున్నామన్నారు. ఈ సందర్భంగా ప్రభుత్వం తరపున మూడు అంశాల్లో తమ సంస్థకు సహకారం కావాలని కోరినట్టు దొరస్వామి తెలిపారు. సంస్థ దిగుమతి చేసిన ముడి సరుకుపై మాత్రమే సుంకం విధిస్తూ, ఎస్ఈజెడ్‌ల నుంచి దేశీయ విక్రయాలను గరిష్టంగా 49 శాతం వరకు అనుమతించాలని, ఎస్ఈజెడ్ యూనిట్లకు ఆర్ఓఎస్‌సిటీఎల్ ప్రయోజనాలను ఐదు శాతం రేటుతో మళ్లీ అమలు చేయాలని, సెజ్ యూనిట్లు దేశీయ మార్కెట్ తయారీదారులకు సబ్‌కాంట్రాక్టింగ్ చేయడానికి అనుమంతించాలని కోరారు. అలాగే భారత మార్కెట్‌లో సెజ్‌ల సమగ్ర అనుసంధానం సులభతరం అవుతుందని వివరించానని తెలిపారు. దీనికి మంత్రి లోకేష్ సానుకూలంగా స్పందించారని దొరస్వామి తెలిపారు.


అనకాపల్లి పట్టణంలో భారీగా వర్షం కురుస్తున్న దృశ్యం


పరవాడలోని పెద్దచెరువు మదుం పైనుంచి ఉధృతంగా ప్రవహిస్తున్న వర్షపు నీరు


సబ్బవరంలో అధికారులకు తహసీల్దార్, ఎంపీడీవో సూచనలు

రోజంతా ముసురే!

- మొంథా తుఫాన్ నేపథ్యంలో ఒక్కసారిగా మారిన వాతావరణం
- లోతట్టు ప్రాంతాలు జలమయం
- స్తంభించిన జనజీవనం
- ఎన్‌డీఆర్‌ఎఫ్ బృందం సిద్ధం
- అనకాపల్లిలో మూతపడిన థియేటర్లు
- అల్లకల్లోలంగా ముత్యాలమ్మపాలెం, తిక్కవానిపాలెం తీరాలు
- పరవాడలో ఈపీడీసీఎల్ కార్యాలయాన్ని సందర్శించిన కలెక్టర్ విజయకృష్ణన్
- తుఫాన్ షెల్టర్‌లను పరిశీలించిన ఎస్పీ తుహిన్ సిన్హా


కశింకోటలోని లోతట్టు ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాన్ని పరిశీలిస్తున్న మండల ప్రత్యేకాధికారిణి లక్ష్మీసుభాషిణి

అనకాపల్లి టౌన్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి) : మొంథా తుఫాన్ ప్రభావం కారణంగా అనకాపల్లి, కశింకోట, పరవాడ, సబ్బవరం మండలాల్లో సోమవారం ఉదయం నుంచి రాత్రి వరకు వర్షం కురుస్తూనే ఉంది. మధ్యలో తెరిపిచ్చినప్పటికీ కాసేపటికి మళ్లీ అదే వాతావరణం నెలకొనేది. ఈ కారణంగా జనజీవనం స్తంభించింది. వర్షాలకు అనకాపల్లి తడిసి ముద్దయ్యింది. రోడ్లపై పల్లపు ప్రాంతాల్లో నీరు నిలిచిపోవడంతో ఆయా మార్గాల్లో రాకపోకలు సాగించేందుకు వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. కొన్నిచోట్ల దుకాణాలు తెరచుకోలేదు. సాయంత్రం వేళ బండ్లపై ఏర్పాటు చేసే ఫాస్ట్‌ఫుడ్ వ్యాపారులు కూడా అధికారుల ముందస్తు సూచనల మేరకు వ్యాపారాలను విరమించుకున్నారు. తుఫాన్ కారణంగా ఎక్కడ ఎటువంటి సంఘటన జరిగినా వెనువెంటనే సహాయక చర్యలు చేపట్టేందుకు ప్రభుత్వం అనకాపల్లికి 35 మంది సభ్యులతో ఎన్‌డీఆర్‌ఎఫ్ బృందాన్ని పంపించింది. వీరికి ఎస్ఆర్ శంకరన్ సమావేశ మందిరంలో వసతి కల్పించారు. సాయంత్రం వరకు ఎక్కడా ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచుసుకోలేదు. ఇదిలావుంటే, పట్టణంలో సినిమా థియేటర్లు మూతపడ్డాయి. మొత్తం ఇక్కడ ఏడు థియేటర్లు ఉండగా, ఐదింటిని సోమవారం మూసివేశారు. మిగిలిన రెండు థియేటర్లలో ఒక ఆట మాత్రమే వారు వారుకూడా నిలిపివేశారు. అలాగే, తుఫాన్ కారణంగా ఏ విధమైన సంఘటనలు జరిగినా వారికి మెరుగైన వైద్యం అందించేందుకు వైద్యులు అందుబాటులో ఉండాలని ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ ఆదేశాలు జారీ చేసినట్టు ఎన్టీఆర్ వైద్యాలయం అభివృద్ధి కమిటీ సభ్యులు ఆళ్ల రామచంద్రరావు తెలిపారు. ఈ మేరకు కలెక్టర్ విజయకృష్ణన్, ఎమ్మెల్యే కొణతాల , డీసీహెచ్ఎస్ శ్రీనివాసరావు, వైద్యాలయం సూపరింటెండెంట్, వైద్యాలయం అభివృద్ధి కమిటీ సభ్యులు తుఫాన్‌పై చర్చించారన్నారు. డయాలసిస్ రోగులను ముందుగానే వైద్యాలయానికి రప్పించి వైద్యసేవలందించాలన్నారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి : ఎమ్మెల్యే కొణతాల

కొత్తూరు : తుఫాన్ పట్ల ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ సూచించారు. అనకాపల్లి రింగ్ రోడ్డులోని జనసేన కార్యాలయంలో సోమవారం ఆయన మాట్లాడుతూ ఎటువంటి పరిస్థితులనైనా ఎదుర్కొనేందుకు కూటమి ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. అంతా అవసరమైన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. అనంతరం పలువురు అధికారులతో ఫోన్‌లో పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ముఖ్యంగా రెవెన్యూ పోలీస్, మెడికల్, విద్యుత్, ఫైర్ సిబ్బంది అనుక్షణం అప్రమత్తంగా ఉండాలన్నారు. రోడ్లు, భవనాలు, పంచాయతీరాజ్ శాఖల అధికారులు కూలిన చెట్లను తొలగించేందుకు ఏర్పాట్లు చేయాలన్నారు. వర్షాల అనంతరం పారిశుధ్యం పెద్ద సమస్యగా మారుతుందని, సదరు అధికారులు సిద్ధంగా ఉండాలని తెలిపారు. మండల కేంద్రాల్లో కంట్రోల్ రూమ్‌లు 24 గంటలూ పని చేయాలని, వాటిని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కూటమి నాయకులు ప్రజలకు సహకారం అందించాలని పిలుపునిచ్చారు.


పరవాడలో సీఐ, సిబ్బందికి సూచనలిస్తున్న ఎస్పీ తుహిన్‌సిన్హా


అనకాపల్లిలో సిద్ధగా ఉన్న ఎన్‌డీఆర్‌ఎఫ్ బృంద సభ్యులు

ఇదిలావుంటే, అనకాపల్లి మండలం తగరంపూడిలో ఉన్న మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలను పునరావాస కేంద్రంగా అధికారులు ఏర్పాటు చేశారు. ఈ గ్రామం శారదా నదిని ఆనుకొని ఉండడం వల్ల ఇక్కడ ఒక కేంద్రాన్ని ఏర్పాటు చేశామని అధికారులు తెలిపారు. ఈ కేంద్రంలో 200 మంది వరకు పునరావాసం కల్పించనున్నామన్నారు.

అవసరమైతేనే బయటకు రండి : మాజీ ఎమ్మెల్యే పీలా

తుమ్మపాల : తుఫాన్ కారణంగా అనకాపల్లి మండలంలోని పలు గ్రామాల్లో సోమవారం తెల్లవారుజాము నుంచి విస్తారంగా వర్షాలు కురిశాయి. ప్రధాన రహదారులన్నీ జలమయమయ్యాయి. తుమ్మపాల మెయిన్ రోడ్డులోని చినబాబు కాలనీ, బొజ్జన్నకొండ రోడ్డు, వెంకుపాలెం జంక్షన్, మార్టూరు జంక్షన్, బవులవాడ ప్రధాన రహదారులు చెరువులను తలపించాయి. దీంతో రాకపోకలు సాగించేవారు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఇదిలావుంటే, తుఫాన్ దృష్ట్యా ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని రాష్ట్ర అర్బన్ ఫైనాన్స్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఛైర్మన్ పీలా గోవింద సత్యనారాయణ పిలుపునిచ్చారు. ముఖ్యంగా శారదానదీ పరీవాహక ప్రాంత ప్రజలు మరిన్ని జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.

కశింకోట మండలంలో...

కశింకోట : తుఫాన్ నేపథ్యంలో మండలంలోని లోతట్టు ప్రాంతాల ప్రజలను ఎప్పటికప్పుడు అధికారులు అప్రమత్తం చేయాలని మండల ప్రత్యేకాధికారిణి వి.లక్ష్మీసుభాషిణి సూచించారు. ఇక్కడి ఎంపీ డీవో కార్యాలయంలో వివిధ శాఖల అధికారులతో ఆమె సమావేశమయ్యారు. లోతట్టు ప్రాంతాలైన వై.తుని, జోగారావుపేట తదితర ప్రాంతాలను అధికారులు పర్యవేక్షించాలన్నారు. అవసరమైతే ఎన్.జి.పాలెం సమీపంలో ఉన్న డెక్కన్ పునరావాస కేంద్రాలకు ప్రజలను తరలించాలని ఆదేశించారు. శారదానది పరీవాహక ప్రాంతాలను అధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షించి మండల కేంద్రంలో కంట్రోల్ రూమ్‌కు సమాచారం ఇవ్వాలన్నారు. అనంతరం పేరంటపాలెం పంచాయతీ శివారు జోగారావుపేట, ఎన్.జి.పాలెం తదితర పునరావాస కేంద్రాలను సందర్శించి ఆయా గ్రామస్థులకు పలు సూచనలు చేశారు. ఆమె వెంట తహశీల్దార్ సిహెచ్. తిరుమలరావు, సీఐ అల్లు స్వామినాయుడు, ఎంపీడీవో చంద్రశేఖరరావు, ఆర్ఐ రమేష్ తదితరులు ఉన్నారు.

ముత్యాలమ్మపాలెం తీరంలో ఎగసి పడుతున్న అలలు

పరవాడ : తుఫాన్ కారణంగా మండలంలోని ముత్యాలమ్మపాలెం తీరం అల్లకల్లోలంగా మారింది. ఉవ్వెత్తున అలలు ఎగసిపడుతున్నాయి. తీరం వెంబడి భారీ ఎత్తున ఈదురు గాలులు వీస్తున్నాయి. వాతావరణ హెచ్చరికల నేపథ్యంలో మత్స్యకారులంతా చేపల వేటకు దూరంగా ఉన్నారు. రెండు రోజులుగా ఇళ్లకే పరిమితమయ్యారు. ముందస్తు చర్యల్లో భాగంగా పడవలు, తెప్పలు, వలలను సురక్షిత ప్రాంతాలకు తరలించే పనిలో నిమగ్నమయ్యారు. అలాగే తిక్కవానిపాలెం తీరంలో కూడా అలలు ఎగసి పడుతున్నాయి. తీరంలో గల సింహాద్రి ఎన్టీపీసీ జెట్టి ప్రాంతం పర్యాటకులతో కళకళలాడేది. తుఫాన్ కారణంగా పర్యాటకులెవరూ సముద్రతీరం వద్దకు వెళ్లరాదని అధికారులు హెచ్చరికలు జారీ చేశారు. ఇదిలావుంటే, తుఫాన్ కారణంగా మండల వ్యాప్తంగా సోమవారం ఉదయం నుంచి విస్తారంగా వర్షాలు కురుస్తున్నాయి. ఎలమంచిలి- గాజువాక ప్రధాన మార్గంలోని జాజులవానిపాలెం, గొర్లివానిపాలెం, పరవాడ సినిమాహాల్ జంక్షన్ సమీపంలో రహదారిపై నుంచి వర్షపునీరు పారింది. పరవాడ పెద్ద చెరువు మదుం పై నుంచి వర్షపునీరు ఉధృతంగా ప్రవహించింది. అలాగే పైడమ్మబంద చెరువు, రావాడ నల్ల చెరువు, కలపాక దుర్గమాంబ గుడి వద్ద గల చెరువుతో పాటు పరవాడ ఊరచెరువు జలకళను సంతరించుకున్నాయి. పలు గ్రామీణ ప్రాంతాల రోడ్డు చిత్తడిగా మారాయి.

లంకెలపాలెం : తుఫాన్ కారణంగా లంకెలపాలెంతో పాటు పెదముషిడివాడ, కన్నూరు, మంత్రిపాలెం పరిసర ప్రాంత గ్రామాల్లో సోమవారం భారీ వర్షం కురిసింది. ఉదయం నుంచి ఎడతెరిపి లేకుండా పడడంతో లోతట్టు ప్రాంతాలన్నీ జలమయమయ్యాయి. లంకెలపాలెం, ఫార్మాసిటీ రహదారి ఏలేరు కాలువ బ్రిడ్జి వద్ద రహదారిపై నుంచి నీరు పారింది. గ్రామాల్లో డ్రైనేజీ వ్యవస్థ అధ్వానంగా ఉండడంతో వర్షానికి మురుగు రహదారులపైకి చేరింది. దీంతో నివాసితులు ఇబ్బందులు పడ్డారు. లంకెలపాలెం నుంచి సబ్బవరం వెళ్లే ప్రధాన రహదారిపైన గుంతల్లో నీరు నిలిచిపోవడంతో వాహన చోదకులు తీవ్ర అవస్థలు పడాల్సి వచ్చింది.

'అధికారులు సమన్వయంతో పని చేయాలి'

సబ్బవరం : తుఫాన్ కారణంగా మండల వ్యాప్తంగా సోమవారం ఉదయం నుంచి సాయంత్రం వరకు వర్షాలు కురుస్తూనే ఉన్నాయి. దీంతో రోడ్లన్నీ చిత్తడిగా మారాయి. జనజీవనం స్తంభించింది. పాతరోడ్డు- గుల్లేపల్లి రహదారిలోని ఆదిరెడ్డిపాలెం వద్ద గెడ్డలోని పూడికను తహశీల్దార్ బి.చిన్నికృష్ణ, సీఐ చంద్రశేఖరరావు దగ్గరుండి ఎక్సకవేటర్ సహాయంతో తీయించారు. ఇదిలావుంటే, అధికారుల అప్రమత్తంగా ఉండాలని ఎంపీడీవో


లంకెలపాలెంలో కుండపోత వాన

పి.పద్మ, తహశీల్దార్ బి.చిన్నికృష్ణ సూచించారు. ఇక్కడి మండల పరిషత్ కార్యాలయంలో అన్నిశాఖల అధికారులతో సమావేశమై సూచనలు చేశారు. ముఖ్యంగా విద్యుత్, వైద్యారోగ్య శాఖ ఇరిగేషన్, వ్యవసాయ శాఖల సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని సూచిం చారు. ఈ సమావేశంలో సీఐ రామచంద్రరావు, వ్యవసాయాధికారి పోతల సత్యనారాయణ, ఏవో పీవీ పంతులు, డిప్యూటీ ఎంపీడీవో డి.చైతన్య, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఎలాంటి పరిస్థితులనైనా ఎదుర్కోవాలి : కలెక్టర్

పరవాడ : మొంథా తుఫాన్ నేపథ్యంలో అధికారులు అప్రమత్తంగా వ్యవహరిస్తూ, ప్రజలకు అందుబాటులో ఉండాలని జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్ సూచించారు. సోమవారం సాయంత్రం ఆమె పరవాడ సబ్ స్టేషన్ వద్ద గల ఈపీడీసీఎల్ కార్యాలయాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా సదరు అధికారులకు పలు సలహాలు, సూచనలు చేశారు. తుఫాన్‌ను దృష్టిలో పెట్టుకొని ముందస్తు చర్యల్లో భాగంగా విద్యుత్ సరఫరాకు సంబంధించిన పరికరాలను సిద్ధం చేసుకోవాలన్నారు. ఎక్కడ ఎలాంటి సమస్య తలెత్తినా తక్షణమే పరిష్కరించాలన్నారు. ఇందుకు సంబంధించి సిబ్బందిని కూడా సిద్ధం చేసుకోవాలన్నారు. విద్యుత్ సరఫరాలో ప్రజలకు ఎలాంటి ఆటంకం లేకుండా చూసుకోవాల్సిన బాధ్యత ఉందని స్పష్టం చేశారు. అనంతరం ఆమె పరవాడ పెద్ద చెరువు, పైడమ్మబంద చెరువులను పరిశీలించారు. చెరువు గట్ల పటిష్టపై ఆరా తీశారు. అక్కడి నుంచి కలెక్టర్ ముత్యాలమ్మపాలెంలో పర్యటించారు. స్థానిక తుఫాన్ రక్షిత కేంద్రాన్ని సందర్శించారు. మత్స్యకారులకు పునరావాస సౌకర్యం కల్పించాలని అధికారులను ఆదేశించారు. తుఫాన్ ప్రభావం తగ్గే వరకు మత్స్యకారులెవరూ వేటకు వెళ్లవద్దని సూచించారు. కలెక్టర్ వెంట మండల ప్రత్యేకాధికారిణి సరోజిని, తహశీల్దార్ నాగరాజు, ఎంపీడీవో రమేష్‌నాయుడు, ఇతర శాఖల అధికారులు ఉన్నారు.

తుఫాన్ షెల్టర్‌లను సందర్శించిన ఎస్పీ

మండలంలో ముత్యాలమ్మపాలెంలో గల తుఫాన్ రక్షిత భవనాన్ని సోమవారం జిల్లా ఎస్పీ తుహిన్‌సిన్హా పరిశీలించారు. తుఫాన్ నేపథ్యంలో మత్స్యకారులను సురక్షితంగా తరలించడానికి అవసరమైన సౌకర్యాలు, భద్రతా ఏర్పాట్లు, సహాయక చర్యలు గురించి సిబ్బందికి పలు సలహాలు, సూచనలు చేశారు. తుఫాన్ ప్రభావిత ప్రాంతాల్లో పోలీసులు, రెవెన్యూ, విపత్తుల నిర్వహణ శాఖలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ఆయన పరవాడ డీఎస్పీ వి.విష్ణుస్వరూప్, సీఐ ఆర్.మల్లికార్జునరావు, సర్పంచ్ చింతకాయల సుజాత, మాజీ సర్పంచ్ చింతకాయల ముత్యాలు తదితరులు ఉన్నారు.

భక్తులతో శైవక్షేత్రాలు కిటకిట

- కార్తీకమాసం తొలి సోమవారం సందర్భంగా వేకువజాము నుంచి పూజలు
- వర్షం కురుస్తున్నా లెక్కచేయక పెద్ద సంఖ్యలో స్వామి దర్శనానికి క్యూ


అనకాపల్లి కాశీవిశ్వేశ్వరుని ఆలయంలో అభిషేకాలు చేస్తున్న అర్చకులు


సబ్బవరం మండలం దేవీపురంలోని దక్షవటిలో స్వామికి భక్తుల పూజలు


కాశీ విశ్వేశ్వరుని ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు

అనకాపల్లి టౌన్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి) : కార్తీకమాసం తొలి సోమవారం సందర్భంగా శైవక్షేత్రాలు భక్తులతో కిటకిటలాడాయి. వేకువజాము నాలుగు గంటల నుంచే దేవదేవునికి పూజలు ఆరంభమయ్యాయి. అనకాపల్లి పట్టణంలోని కాశీవిశ్వేశ్వర, సిద్ధిలింగేశ్వర, ఉమా రామలింగేశ్వర, భోగలింగేశ్వర ఆలయాలతో పాటు, కొబ్బరికాయల మార్కెట్ వద్ద గల శివాలయం, వీరభద్రస్వామి తదితర ఆలయాలు సందడిగా మారాయి. అర్చకులు స్వామివారికి విశేష అర్చనలు, అభిషేకాలు జరిపారు. మహిళలు ధ్వజస్తంభాల వద్ద దీపారాధన చేశారు. వర్షం కురుస్తున్నప్పటికీ భక్తులు గొడుగులు చేతబట్టి మరీ స్వామి దర్శనాలకు క్యూకట్టారు.

కశింకోట మండలంలో..

కశింకోట : మండలంలోని శివాలయాలు భక్తులతో కిక్కిరిసిపోయాయి. కశింకోట, బయ్యవరం, వెదురుపర్తి, ఎన్‌జీపాలెం తదితర గ్రామాల్లోని ఆలయాల్లో వేకువజామున నుంచి పూజలు ప్రారంభమయ్యాయి. ముందుగా మహిళలు ధ్వజస్తంభానికి పూజలు జరిపిన అనంతరం స్వామిని దర్శించుకున్నారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యం లేకుండా ఆలయాల నిర్వాహకులు ఏర్పాట్లు చేపట్టారు.

పరవాడ మండలంలో...

పరవాడ : కార్తీకమాసం తొలి సోమవారం సందర్భంగా మండలంలోని శివాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. వేకువజాము నుంచి సందడి ఆరంభమైంది. పరవాడలోని మల్లికార్జునస్వామి, తాడి గ్రామంలోని ఉమానీలకంఠేశ్వర ఆలయాలతో పాటు స్వయం భూవరం, లేమర్తి అగ్రహారం, దేశపాత్రునిపాలెం గ్రామాల్లోని ఆలయాల్లో పూజలు నిర్వహించారు.

సబ్బవరం మండలంలో...

సబ్బవరం : మండలంలో శైవక్షేత్రాలు కార్తీక సోమవారం సందర్భంగా భక్తుల శివ నామ స్మరణతో మార్మోగాయి. దేవీపురంలోని దక్షవటి, వంగలి, లింగాలతిరుగుడులోని సోమలింగేశ్వర స్వామి ఆలయాలు, ఇరువాడలోని భీమలింగేశ్వరస్వామి, పైడివాడ స్వయంభూ నందీశ్వర స్వామి, సబ్బవరం, గొర్లివానిపాలెంలోని ఉమా రామలింగేశ్వరస్వామి ఆలయాలు, పెదయాతపాలెంలోని గౌరీపరమేశ్వర సహిత ద్వాదశ జ్యోతిర్లింగాలయం, గణపతిపురంలోని మల్లికార్జునస్వామి, మొగలిపురంలోని విఘ్నేశ్వరాలయం భక్తులతో కిటకిటలాడాయి.

సహాయక చర్యలకు సర్వం సిద్ధం

- 20 క్విక్ రెస్పాన్స్ టీమ్‌లు ఏర్పాటు : జీవీఎంసీ కమిషనర్

విశాఖపట్నం, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్‌తో భారీవర్షాలు కురిసే అవకాశం ఉన్నందున లోతట్టు, కొండవాలు ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, సహాయక చర్యలకు జీవీఎంసీ యంత్రాంగం సిద్ధంగా ఉందని జీవీఎంసీ కమిషనర్ కేతన్‌గార్గ్ స్పష్టంచేశారు. ఈ మేరకు సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. జీవీఎంసీ ప్రధాన కార్యాలయంతో పాటు అన్ని జోనల్ కార్యాలయాల్లో కంట్రోల్ రూమ్‌లను ఏర్పాటు చేసి టోల్ ఫ్రీ నంబర్లను అందుబాటులో ఉంచామన్నారు. అత్యవసర పరిస్థితుల్లో లోతట్టు, కొండవాలు ప్రాంత ప్రజలను పునరావాస కేంద్రాలకు తరలించాలని అధికారులు, జోనల్ కమిషనర్లకు సూచించారు. నగరంలోని ప్రధాన గెడ్డలు పొంగి పొర్లితే చర్యలు తీసుకునేందుకు వీలుగా జేసీబీలు, వ్యర్థాలు తరలించే వాహనాలను, జనరేటర్లను అందుబాటులో ఉంచుకోవాలని ఆదేశించారు. నగర పరిధిలో 55 పునరావాస కేంద్రాలు, సహాయక చర్యల కోసం 20 క్విక్ రెస్పాన్స్ టీమ్‌లను ఏర్పాటు చేశామన్నారు. ప్రతి టీమ్‌లో జేసీబీ, టిప్పర్, ట్రాక్టర్, ట్రీ కట్టర్, బైలింగ్ మిషన్లను ఉంచామన్నారు. 29 జేసీబీలు, 82 స్ప్రేయర్లు, 64 ఫాగింగ్ మిషన్లు, 26 పవర్ రంపాలు, ట్రీ కట్టర్లు, 2 శక్తిమాన్, 15 జనరేటర్లు, 108 ఉపగ్రహ-కమ్యూనికేషన్ పరికరాలను సిద్ధం చేశామన్నారు. ఈనెల 30వ తేదీ వరకు కంట్రోల్ రూమ్‌లలో 24 గంటలు పనిచేసేలా సిబ్బందిని నియమించామన్నారు. జీవీఎంసీ ప్రధాన కార్యాలయంలోని కంట్రోల్ రూమ్ టోల్ ఫ్రీ నంబరు 180042500009, టెలిఫోన్ నంబరు 0891-2507225 అందుబాటులో ఉంచామన్నారు.

కాంప్లెక్స్‌లో సమస్య పరిష్కారానికి చర్యలు

- జీవీఎంసీ జోనల్ కమిషనర్ చక్రవర్తి హామీ

అనకాపల్లి టౌన్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని ఆర్టీసీ కాంప్లెక్స్ ఆవరణలో సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని జీవీఎంసీ జోనల్ కమిషనర్ కె.చక్రవర్తి పేర్కొన్నారు. వర్షం కురిసినప్పుడల్లా కాంప్లెక్స్ ఆవరణలోంచి నీరు కాలువలోకి పోవడానికి సరైన ఔట్‌లెట్ సౌకర్యం లేకపోవడంతో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఆర్టీసీ అధికారుల సూచనల మేరకు సోమవారం జోనల్ కమిషనర్ చక్రవర్తి, టీపీవో వరప్రసాద్, డీఈ గోపాలకృష్ణ తదితరులు కాంప్లెక్స్ ఆవరణను పరిశీలించారు. కాంప్లెక్స్ వెనుక భాగంలో ఉన్న డ్రైన్‌పై ఆరా తీశారు. డ్రైన్‌కు ఉన్న జాలీలు చిన్నవి కావడం వల్ల, ఔట్‌లెట్ సౌకర్యం సరిగా లేకపోవడం వల్ల సమస్య తలెత్తుతుందని జడ్సీ అభిప్రాయపడ్డారు. కాంప్లెక్స్ ఆవరణలో నీరు నిల్వ ఉండకుండా తగిన చర్యలు తీసుకుంటామని, ఎమ్మెల్యే దృష్టికి తీసుకువెళ్లి శాశ్వత పరిష్కారానికి కృషి చేస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో జీవీఎంసీ ఏపీడీ వై.సంతోష్‌కుమార్, ఆర్టీసీ డీపీటీవో వి.ప్రవీణ, డిపో మేనేజర్ కె.హనుమశ్రీ తదితరులు పాల్గొన్నారు.


డిపో ఆవరణలో నీరు నిలిచిపోయిన ప్రదేశాన్ని పరిశీలిస్తున్న జడ్సీ

సింహాద్రిలో విజిలెన్స్ అవగాహన వారోత్సవాలు ప్రారంభం


వారోత్సవాల ప్రారంభిస్తున్న సింహాద్రి సంస్థ ఈడీ సమీర్‌శర్మ

పరవాడ, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి) : సింహాద్రి ఎన్టీపీసీలో సోమవారం విజిలెన్స్ అవగాహన వారోత్సవాలు ప్రారంభమయ్యాయి. ఇందులో భాగంగా స్థానిక అడ్మిన్ భవనంలో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమానికి సింహాద్రి ఈడీ సమీర్‌శర్మ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా అధికారులతో కలిసి ప్రతిజ్ఞ చేశారు. అధికారులందరూ అప్రమ త్తంగా వ్యవహరించాలని, ఇది అందరి బాధ్యతగా తీసుకోవాలని ఆయన సూచించారు. వచ్చే నెల రెండో తేదీ వరకు వారోత్సవాలు జరుగుతాయన్నారు. వివిధ విభాగాల జీఎంలు, ఏజీఎంలు తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీలో హెవీ లైసెన్సు డ్రైవర్లకు శిక్షణ

అనకాపల్లి టౌన్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి) : ఇక్కడి ఆర్టీసీ డిపోలో సోమవారం హెవీ డ్రైవింగ్ లైసెన్సు కోసం దరఖాస్తుదారులకు శిక్షణ ఇచ్చారు. తొలుత ఈ కార్యక్రమాన్ని డీపీటీవో వి.ప్రవీణ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 40 రోజులు శిక్షణ ఇచ్చి లైసెన్సు టెస్టుకు పంపడం జరుగుతుందన్నారు. ఎంతో క్రమశిక్షణ కలిగిన ఆర్టీసీ డ్రైవర్లతో శిక్షణ ఇస్తున్నట్టు చెప్పారు. ఇక్కడ డ్రైవింగ్ మాత్రమే కాకుండా బస్సు మెకానిజం, ట్రాఫిక్ సిగ్నల్స్, ఫైర్ సర్వీస్‌పై అవగాహన కల్పిస్తున్నట్టు చెప్పారు. ఎస్సీ కార్పొరేషన్ నుంచి మొదటి బ్యాచ్‌గా 16 మంది అభ్యర్థులను ఎంపిక చేయడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో అనకాపల్లి డిపో మేనేజర్ హనుమశ్రీ, ఎస్సీ కార్పొరేషన్ ఈవో ఎం.సత్యపద్మ తదితరులు పాల్గొన్నారు.

ధ్యాన మందిరానికి కంచు గంట బహూకరణ

కశింకోట, అక్టోబర్ 27 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రం వేంకటేశ్వర ధ్యాన మందిరంలో ఉన్న వేంకటేశ్వరస్వామి దేవస్థానానికి కంచు గంటను ఊడిగల నర్సింగరావు అనే భక్తుడు సమకూర్చారు. సోమవారం దానిని గుడిబయట వైపు ఏర్పాటు చేసినట్టు ఆలయ అర్చకుడు రేజేటి చరణ్ తెలిపారు.

పుస్తక మహోత్సవం వాయిదా


అనకాపల్లి టౌన్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి) : స్థానిక ఎన్టీఆర్ స్టేడియంలో ఈనెల 28వ తేదీన జరగాల్సిన అనకాపల్లి పుస్తక మహోత్సవం 30వ తేదీకి వాయిదాపడినట్టు నిర్వాహకులు తెలిపారు. తుఫాన్ హెచ్చరికల నేపథ్యంలో సందర్శకుల భద్రతను దృష్టిలో పెట్టుకుని ఈ నిర్ణయం తీసుకున్నట్టు విజయవాడ బుక్ ఫెస్టివల్ సొసైటీ ప్రకటించింది.

హోంగార్డు కుటుంబానికి ఆర్థిక సాయం


మృతుడి కుటుంబానికి చెక్కు అందిస్తున్న ఎస్పీ తుహిన్ సిన్హా

అనకాపల్లి రూరల్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి) : నర్సీపట్నం టౌన్ పోలీస్ స్టేషన్‌లో పనిచేస్తూ అనారోగ్యంతో మృతి చెందిన హోంగార్డు ఎం.సత్యనారాయణ కుటుంబానికి తోటి సిబ్బంది సోమవారం ఆర్థిక సహాయం అందజేశారు. అనకాపల్లి, అల్లూరిసీతారామరాజు జిల్లాల్లో పనిచేస్తున్న హోంగార్డులంతా కలిసి ఒకరోజు తమ వేతనాన్ని మృతుడు కుటుంబానికి రూ.మూడు లక్షల 98వేల 610లను సమకూర్చారు. ఈ మొత్తం చెక్కును ఎస్పీ తుహిన్‌సిన్హా చేతుల మీదుగా జిల్లా పోలీసు కార్యాలయంలో మృతుడు భార్య వెంకటలక్ష్మికి అందజేశారు.

భోగలింగేశ్వర స్వామి ఆలయానికి డస్ట్‌బిన్‌ల వితరణ


మాజీ చైర్మన్‌కు డస్ట్‌బిన్‌లు అందిస్తున్న క్లబ్ ప్రతినిధులు

అనకాపల్లి టౌన్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి) : గవరపాలెం కోటమీద గల భోగలింగేశ్వరస్వామి ఆలయానికి పట్టణానికి చెందిన బెస్ట్ ఫ్రెండ్స్ క్లబ్ ప్రతినిధులు సోమవారం డస్ట్ బిన్‌లను వితరణగా అందజేశారు. క్లబ్ ప్రతినిధులు పెంటకోట నరసింగరావు, పీఎస్ అప్పారావు, పెంటకోట ప్రభాకర్, భరిణికాన శ్రీనివాసరావులు ఆలయ మాజీ చైర్మన్ కాండ్రేగుల సత్యనారాయణకు అందజేశారు. పరిసరాల పరిశుభ్రతలో భాగంగా వీటిని ఆలయానికి ఇచ్చినట్టు క్లబ్ నిర్వాహకులు తెలిపారు.

సోమనాథేశ్వరస్వామికి ఆభరణాల వితరణ



సోమనాథేశ్వరస్వామికి ఆభరణాలను అందజేస్తున్న భక్తులు

పాడేరురూరల్, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): పాడేరు పూర్ణ పుష్కలాంబ అయ్యప్పస్వామి ఆలయంలో కొలువైన సోమనాథేశ్వస్వామికి సోమవారం భక్తులు ఆభరణాలను సమర్పించారు. ఆలయ ధర్మకర్త కొట్టగుళ్లి సుబ్బారావుకు పట్టణానికి చెందిన వేయ్యాదళముల శ్రీనివాస రావు, రమణి దంపతులు రూ. 8 వేలు విలువైన ఇత్తడి నాగాభరణ కిరీటాన్ని అందజేశారు. అదేవిధంగా గోకాడ నాగరాజేంద్ర, వెంకటలక్ష్మి దంపతులు రూ.10 వేలు విలువ గల ఇత్తడి దీపం కుందులను అందించారు. అనంతరం పూజలు చేపట్టి స్వామివారికి కిరీటాన్ని అలంకరించారు. ఆభరణాలను బహూకరించిన భక్తులను ఆలయ ధర్మకర్త సుబ్బారావు ఆధ్వర్యంలో కమిటీ ప్రతినిధులు సన్మానించి అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలమ కమిటీ కార్యదర్శి రొబ్బి రాము, ప్రచార కార్యదర్శి వర్మరాజు, కోశాధికారి వి.నగేష్, దామో, కమిటీ ప్రతినిధులు సత్తిబాబు, కుసుమ పాల్గొన్నారు.

పోలీసుల విధులపై విద్యార్థులకు అవగాహన



ఆయుధాలపై విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న పోలీసులు

చింతపల్లి, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): పోలీసుల విధులపై విద్యార్థులకు అవగాహన స్థానిక ఎస్‌ఐ వి. వెంకటేశ్వరరావు అవగాహన కల్పించారు. సోమవారం స్థానిక స్టేషన్‌లో పోలీసు అమరవీరుల సంస్మరణ వారోత్సవంలో భాగంగా ఓపెన్ హౌస్ నిర్వహించారు. ఏపీఆర్ జూనియర్ కళాశాల, బాలుర ఆశ్రమ పాఠశాల విద్యార్థులు పోలీసు స్టేషన్‌ను సందర్శించారు. ఈసందర్భంగా ఎస్‌ఐ వెంకటేశ్వరరావు పోలీసు స్టేషన్‌లో ఉండే అధికారులు, నేరస్థులను ఉంచే గది, పోలీసులు వినియోగించే ఆయుధాల గురించి విద్యార్థులకు వివరించామన్నారు. కార్యక్రమంలో పీజీహెచ్‌ఎం సాగిన రామరాజు పడాల్‌పాల్గొన్నారు.

జెన్‌కోలో గిరిజనేతర మహిళ నియమాకాన్ని రద్దు చేయాలి

» డీఎల్‌వో రాష్ట్ర అధ్యక్షుడు మార్కురాజు

గూడెంకొత్తవీధి, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి):సీలేరు జల విద్యుత్ కేంద్రంలో గిరిజనేతర మహిళకు కేటాయించిన కాంట్రాక్టు లేబర్ పోస్టును తక్షణమే రద్దు చేయాలని దండకారణ్య విమోచన సమితి(డీఎల్‌వో) రాష్ట్ర అధ్యక్షుడు కె. మార్కురాజు డిమాండ్ చేశారు. సోమవారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ కొంత కాలంగా జలవిద్యుత్ కేంద్రంలో కాంట్రాక్టు లేబర్ పోస్టు అర్హులైన గిరిజనులకు కేటాయించాలని కోరామన్నారు. అయితే జెన్‌కో అధికారులు గిరిజనేతర మహిళకు కేటాయించడం అన్యాయమన్నారు. తక్షణమే ఏపీ జెన్‌కో అధికారులు అర్హులైన గిరిజన మహిళకు కాంట్రాక్టు లేబర్ పోస్టు కేటాయించాలని, లేదంటే ఆందోళనలు ఉధృతం చేస్తామన్నారు. ఈకార్యక్రమంలో డీఎల్‌వో జిల్లా ప్రధాన కార్యదర్శి కిల్లో మనోజ్ కుమార్, నాయకుడు కిలో నింది పాల్గొన్నారు.

వేంగడను అనంతగిరిలోనే సాగించాలి

అనంతగిరి, అక్టోబర్ 27 (ఆంధ్రజ్యోతి): వేంగడ పంచాయతీని అనంతగిరి మండలంలోనే కొనసాగించాలని తహశీల్దార్ వీరభద్రచారికి గిరిజనులు సోమవారం వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా మాజీ సర్పంచ్ సీవేరి కొండలరావు మాట్లాడుతూ హుకుంపేట మండలం ఉప్పను మండలం ప్రకటించేందుకు సర్వేలు నిర్వహించారని, అయితే వేంగడ పంచాయతీ అనంతగిరి మండలానికి దగ్గర ఉంటుందని వివరించారు. పంచాయతీలోని 16 గ్రామాల గిరిజనులు వినతి మేరకు తీర్మానం చేశామని ఆయన చెప్పారు. ఈ కార్యక్రమంలో పెసా కమిటీ సభ్యులు భీమన్న, సింహాద్రి, కళ్యాణ్, రామన్న, దేముడు, తదితరులు పాల్గొన్నారు.

రైతులు అప్రమత్తంగా ఉండాలి

» అరకు ఎమ్మెల్యే రేగం మత్స్యలింగం



రైతులకు అవగాహన కల్పిస్తున్న ఎమ్మెల్యే, ఎంపీపీ, పశువైద్యాధికారి

అనంతగిరి, అక్టోబర్ 27 (ఆంధ్రజ్యోతి): మొంథా తుపాన్ ప్రభావం కారణంగా పశు సంపద కలిగిన రైతులు అప్రమత్తంగా ఉండాలని అరకు ఎమ్మెల్యే రేగం మత్స్యలింగం పిలుపునిచ్చారు. మండలంలోని కాశీపట్నం పంచాయతీ కేంద్రంలోని పశు వైద్యాధికారులు సాగిరి గణేశ్వరరావు, అనిల్ ఆధ్వర్యంలో రైతులను అప్రమత్తం చేశారు. పశువులను మేతకోసం బయటకు తోలుకుని వెళ్లవద్దని, సురక్షిత ప్రాంతాలకు తరలించాలని చెప్పారు. అలాగే తుపాన్ కారణంగా పశువులు మృత్యువాతపడితే పశువైద్య సిబ్బందికి సమాచారం అందించాలని, పశువులు వ్యాధుల బారినపడకుండా చర్యలు చేపట్టాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ శెట్టి నీలవేణి, గుమ్మకోట సర్పంచ్ అప్పారావు, తదితరులు పాల్గొన్నారు.

తుఫాన్ ప్రభావంతో జోరు వాన



హుకుంపేట మండల కేంద్రంలో కురుస్తున్న వర్షం

అరకులోయ/హుకుంపేట/డుంబ్రిగుడ/పెదబయలు, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): అరకు నియోజకవర్గ కేంద్రంతో పాటు హుకుంపేట, డుంబ్రిగుడ, పెదబయలు మండలాల్లో మొంథా తుపాన్ ప్రభావంతో జోరుగా వానలు పడుతున్నాయి. సోమవారం ఉదయం 10 గంటల నుంచి ముసురు వాతావరణం నెలకొంది. దీంతో ఆకాశం మేఘావృతమై ఈదురు గాలులతో కూడిన వర్షం కురుస్తున్నది. తుఫాన్ ఎఫెక్ట్‌తో బొర్రా గుహలు, చాపరాయి, పద్మాపురం గార్డెన్స్, గిరిజన మ్యూజియం తదితర పర్యాటక కేంద్రాలు మూతబడ్డాయి. తుఫాన్ తగ్గుముఖం పట్టే వరకు సందర్శకులు రావద్దని డుంబ్రిగుడ ఎస్‌ఐ పాపినాయుడు తెలిపారు. అలాగే పెదబయలు వారపు సంత వినియోగదారులు లేక వెలవెల బోయింది.హుకుంపేట మండల కేంద్రంలోని చీడిపుట్టు వంతెన వద్ద పోలీసులు, రెవెన్యూ అధికారులు హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేశారు. అలాగే రహదారులు నిర్బంధించి గస్తీ ఏర్పాట్లు చేసినట్టు సీఐ సన్యాసినాయుడు, ఎస్‌ఐ సూర్యనారాయణ తెలిపారు.



చింతపల్లి: సమావేశంలో మాట్లాడుతున్న ప్రత్యేకాధికారి డాక్టర్ జయరాజ్



పాడేరురూరల్: ఒరిగిన విద్యుత్ స్తంభాన్ని సరిచేస్తున్న విద్యుత్ సిబ్బంది

తుఫాన్ నేపథ్యంలో ఉద్యోగులు అందుబాటులో ఉండాలి

» మండల ప్రత్యేకాధికారి జయరాజ్

చింతపల్లి, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి):మొంథా తుఫాన్ నేపథ్యంలో ప్రజలకు అత్యవసర సేవలందించేందుకు అధికారులు, ఉద్యోగులు అందుబాటులో ఉండాలని మండల ప్రత్యేకాధికారి డాక్టర్ వి.జయరాజ్ అన్నారు. సోమవారం మండల పరిషత్ కార్యాలయంలో వివిధ శాఖల అధికారులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మంగళ, బుధవారాలు మొంథా తుఫాన్ ప్రభావం అధికంగా ఉంటుందన్నారు. ఈ రెండు రోజులు అధికారులు, ఉద్యోగులు సెలవులు పెట్టరాదన్నారు. ప్రజల ఆస్తి, ప్రాణ నష్టం కలగకుండా అధికారులు ముందస్తు చర్యలు తీసుకోవాలన్నారు. పునరావాసం కల్పించేందుకు ప్రభుత్వ పాఠశాలలను సిద్ధం చేయాలన్నారు. రక్షిత నీరు, విద్యుత్ సరఫరా, సెల్ సిగ్నల్స్‌కి అంతరాయం కలగకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో వైద్యాధికారులు, వైద్య సిబ్బంది సిద్ధంగా ఉండాలన్నారు. ప్రధాన మార్గాల్లో రాకపోకలకు అంతరాయం కలగకుండా ఆర్‌అండ్‌బీ, పంచాయతీరాజ్ అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. రహదారికి అడ్డంగా వృక్షాలు పడితే వెంటనే తొలగించాలన్నారు. రాత్రివేళ లంబసింగి ఘాట్‌లో ప్రజలు ప్రయాణాలను విరమించుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో సీహెచ్ సీతామహాలక్ష్మి, తహశీల్దార్ శంకరరావు, ఎంఈవో పీటీవీవీవీ ప్రసాద్, అధికారులు పాల్గొన్నారు.

సీలేరులో..

సీలేరు పోలీస్ స్టేషన్ పరిధిలోని అన్ని గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని స్థానిక ఎస్‌ఐ ఎండీ యాసిన్ సూచించారు. మొంథా తుఫాన్ సందర్భంగా ఆయన విలేకర్లతో మాట్లాడుతూ గాలికొండ, అమ్మవారిధారకొండ, గుమ్మిరేవుల, ధారకొండ పంచాయతీల ప్రాంతాల్లో చట్రాపల్లి, నిమ్మచెట్టు, తోకరాయి, మాదిమళ్ళు, వంటి కొండ దిగువ ప్రాంతాల ప్రజలు రానున్న రెండు రోజులు అప్రమత్తంగా ఉండాలన్నారు. ప్రజలు గెడ్డలు, వాగులు దాటే ప్రయత్నాలు చేయవద్దన్నారు. తుఫాన్ వలనే ఏదైనా గ్రామంలో సమస్య తలెత్తితే వెంటనే 9440904234కు తెలియజేయాలని ఎస్‌ఐ ఎండీ యాసిన్ కోరారు.

కొయ్యూరులో..

మొంథా తుఫాన్ ప్రభావంతో సోమవారం ఉదయం నుంచి మండలంలో ముసురు వాతావరణం నెలకొంది. ఉదయం పది గంటల నుంచి చిరుజల్లులు, అడపాదడపా వర్షం కురుస్తోంది. మరో రెండు రోజుల పాటు తుఫాన్ ప్రభావం ఉంటుందనే వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో వరి, అపరాలు, వాణిజ్య పంటల సాగు చేస్తున్న రైతాంగం ఆందోళన చెందుతోంది. తుఫాన్ సహాయక చర్యలపై తహశీల్దారు కార్యాలయంలో కంట్రోల్‌రూం ఏర్పాటు చేసినట్టు తహశీల్దారు ఎస్‌ఎల్‌వీ ప్రసాద్, డీటీ కుమారస్వామి తెలిపారు.

జి.మాడుగులలో..

తుఫాన్ నేపథ్యంలో ప్రజలు సురక్షిత ప్రాంతాల్లో ఉండాలని తహశీల్దార్ రాజ్‌కుమార్, ఎంపీడీవో డేవిడ్‌రాజు సూచించారు. సోమవారం వారు మండల అధికారులు, సిబ్బందికి తగు సూచనలు చేశారు. కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశారు. ఎక్కడ ఎటువంటి ఘటన జరిగినా వెంటనే స్పందించాలన్నారు. ప్రజలకు అందుబాటులో ఉండాలన్నారు. ఈదురుగాలులు లేకపోవడంతో ఎటువంటి సంఘటనలు చోటుచేసుకోలేదు.

పాడేరురూరల్‌లో..

మొంథా తుఫాన్ నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని డీఎస్పీ షేక్ షహబాద్ అహమ్మద్ సూచించారు. ఎస్పీ అమిత్ బర్దర్ ఆదేశాల మేరకు అత్యవసర సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై డీఎస్పీ షహబాజ్ అహమ్మద్ ఆధ్వర్యంలో సోమవారం సాయంత్రం పాడేరు ఆర్టీసీ కాంప్లెక్స్‌లో ప్రయాణికులకు మెడికల్ కళాశాల సిబ్బంది, అగ్నిమాపక సిబ్బంది డెమోలను నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ వర్షాల సమయంలో తీసుకోవలసిన జాగ్రత్తలను వివరించారు. అనంతరం మెడికల్ కళాశాల వైద్యులు ప్రమాదాలకు గురైనపుడు గుండె ఆగిపోయిన సందర్భాల్లో సీపీఆర్ విధానం ద్వారా శ్వాస పునరుద్ధరించడంపై డెమో నిర్వహించారు. అగ్ని ప్రమాదాలు జరిగినపుడు, గ్యాస్ సిలెండర్ ఫైర్ జరిగినపుడు చెలరేగే మంటలను ఏవిధంగా ఆపాలి.. వరదల్లో చిక్కుకొని నీటిలో మునిగే బాధితులను ఏవిధంగా రక్షించాలనే విషయాలపై డెమో ఇచ్చి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో సీఐ డి.దీనబంధు, ఫైర్ స్టేషన్ డీఎఫ్‌వో బి.లక్ష్మణస్వామి, బాలకృష్ణ, బి.వెంకటేష్, వరహాలరాజు, వైద్యుడు ఎర్రయ్య, ఆర్టీసీ డిపో మేనేజర్ పసగాడ శ్రీనివాసరావు పాల్గొన్నారు.



పాడేరు రూరల్: అగ్నిప్రమాద సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరిస్తున్న ఫైర్ సిబ్బంది. చిత్రంలో డీఎస్పీ షేక్ షహబాద్ అహమ్మద్

అప్రమత్తంగా ఉండాలి

పాడేరు మేజర్ పంచాయతీ పరిధిలోని మూడు సచివాలయాల ఉద్యోగులు, పంచాయతీ పారిశుధ్య కార్మికులు అప్రమత్తంగా ఉండాలని పాడేరు సర్పంచ్ కొట్టగుళ్లి ఉషారాణి అన్నారు. మొంథా తుఫాన్ నేపథ్యంలో సోమవారం పంచాయతీ కార్యాలయంలో నిర్వహించిన అత్యవసర సమావేశంలో ఆమె మాట్లాడారు. తుఫాన్ నేపథ్యంలో ప్రజలు తీసుకోవాల్సిన జాగ్రత్తలను ప్రజలకు సచివాలయ ఉద్యోగులు వివరించాలన్నారు. తాగునీటి సరఫరా, వైద్య సేవలు అందుబాటులో ఉండాలన్నారు. కాలువల్లో పూడిక తొలగించాలని, చెట్లు, విద్యుత్ స్తంభాలు పడిపోతే వెంటనే తొలగించేందుకు ఎక్స్‌కవేటర్లను సిద్ధంగా ఉంచుకోవాలన్నారు. సమావేశంలో పంచాయతీ ఈవో రమేష్, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కొట్టగుళ్లి సుబ్బారావు పాల్గొన్నారు.

అప్రమత్తమైన విద్యుత్ సిబ్బంది

మొంథా తుఫాన్ నేపథ్యంలో పాడేరు విద్యుత్ సబ్ స్టేషన్ సిబ్బంది అప్రమత్తమయ్యారు. తుఫాన్ మొదటి రోజు వీచిన గాలులకు విరిగిపడ్డ చెట్టు కొమ్మలతోపాటు విద్యుత్ తీగలకు తగిలే కొమ్మలను సోమవారం తొలగించారు. అదేవిధం గా ఒరిగి ఉన్న విద్యుత్ స్తంభాలను సరిచేశారు. ట్రాన్స్‌ఫార్మర్లను సరిచేసి విద్యుత్‌కు అంతరాయం కలగకుండా చర్యలు చేపట్టారు. దీంతో మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపిచేశారు.

భక్తులతో కిటకిటలాడిన శివాలయాలు



పాడేరురూరల్: ఉమానీలకంఠేశ్వరస్వామి ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు



చింతపల్లి: బౌడ శివాలయంలో పూజలు నిర్వహిస్తున్న భక్తులు

పాడేరురూరల్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): కార్తీక మాసం తొలి సోమవారం సందర్భంగా మండలంలోని శివాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. శివనామ స్మరణతో మార్మోగాయి. పూర్ణపుష్కలాంబ అయ్యప్పస్వామి ఆలయంలోని శివాలయంలో అధిక సంఖ్యలో భక్తులు, అయ్యప్ప మాలధారులు స్వామి వారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. భక్తులకు ఆలయ ధర్మకర్త కొట్టగుళ్లి సుబ్బారావు ఆధ్వర్యంలో ఆలయ కమిటీ ప్రతినిధులు తీర్థప్రసాదాలను పంపిణీ చేశారు. ఉమానీలకంఠేశ్వరస్వామి ఆలయం, పాత పాడేరులోని స్వయంభూ గౌరీ నీలకంఠేశ్వరుని ఆలయం, త్రిముఖ లింగేశ్వర ఆలయాలు ఉదయం 5 గంటల నుంచే భక్తులతో కిటకిటలాడాయి. ఉమానీలకంఠేశ్వరుని ఆలయంలో భక్తులకు ఆలయ ధర్మకర్త కొట్టగుళ్లి సింహాచలంనాయుడు, రమాదేవి దంపతుల ఆధ్వర్యంలో ప్రసాదం, తాగునీటి పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ ప్రతినిధులు కొట్టగుళ్లి రామారావు, రాజబాబు, బాబూరావు, కొండలరావు, ముకుందరావు, వెంకటరత్నం తదితరులు సేవా కార్యక్రమాలను చేపట్టారు.

చింతపల్లిలో..

మండలంలోని కిటుముల పంచాయతీ బౌడ శివాలయంలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు జరిగాయి. కార్తీక సోమవారం పురస్కరించుకుని ఆలయక కమిటీ సభ్యులు ప్రత్యేక పూజా కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. జి.మాడుగుల, చింతపల్లి, జీకేవీధి మండలాలతో పాటు నర్సీపట్నం పరిసర ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలి వచ్చారు. దీంతో శివాలయం భక్తులతో రద్దీగా కనిపించింది.



సీలేరు శివాలయంలో ధ్వజస్తంభం వద్ద పూజలు చేస్తున్న భక్తులు

అరకులోయలో...



అరకులోయ శివాలయంలో బారులు తీరిన భక్తులు

అరకులోయ: అరకులోయ శివాలయానికి భక్తులు పోటెత్తారు. స్వామివారి దర్శనానికి తెల్లవారు జాము నుంచే బారులు తీరారు. తెల్లవారు 4 గంటల నుంచే భక్తులు శివాలయానికి చేరుకొని దీపారాధనలో పాల్గొన్నారు. అలాగే గోత్ర నామాలతో పూజలు చేశారు. ఆలయ ప్రధాన అర్చకుడు వెంకన్న పంతులు భక్తులకు అభిషేకాలు చేసి తీర్థప్రసాదాలను అందించారు. అలాగే యండపల్లివలస, కురిడి, సుంకరమెట్ట, నందివలస, దుమ్మగుడ్రి తదితర గ్రామాల్లో ఉన్న శివాలయాలకు భక్తులు తెల్లవారు జామునే వెళ్లి భక్తి శ్రద్ధలతో పూజా కార్యక్రమాలు నిర్వహించారు.

సీలేరులో...

సీలేరు శివాలయం భక్తుల శివ నామస్మరణతో మార్మోగింది. కార్తీకమాసం మొదటి సోమవారాన్ని పురస్కరించుకుని సీలేరు, పరిర ప్రాంతాల భక్తులు శివాలయంలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆలయంలో శివుడిని దర్శించుకోవడానికి భక్తులు బారులు తీరారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకుడు రామశర్మ అభిషేకాలు, పూజలు చేశారు. ఆలయంలో భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా ఆలయ కమిటీ ప్రత్యేక ఏర్పాట్లను చేసింది.

గ్రామాల్లో సదుపాయాలు కల్పించాలని నిరసన

పెదబయుల, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అనేక గ్రామాలకు మౌలిక వసతులు లేకపోవడంతో గిరిజనులు దుర్భరమైన జీవనం గడుపుతున్నారని జీఎస్‌యూ నాయకులు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మేరకు బొంగరం, కిముడుపల్లి పంచాయతీలను సోమవారం వారు సందర్శించి గిరిజనులతో కలిసి నరిసన తెలిపారు. బొంగరం పంచాయితీ పరిధిలో గల డి.కొత్తూరు, దోసలబంధ, కుంబుర్ల గ్రామాలకు కలుపుతూ గత వైసీపీ ప్రభుత్వం హయంలో 2023లో ప్రారంభించిన రోడ్డు పనులను అర్థాంతరంగా నిలిపివేయడంతో రవాణా కష్టాలు తీరటం గిరిజనులు వాపోయారు. అలాగే డి.కొత్తూరు, దోసలబంధ, రాళ్లగొంది గ్రామాలకు చెంది సుమారు 70 మంది బడి ఈడు పిల్లలు ఉన్నప్పటికీ పాఠశాల లేకపోవడంతో నానా అవస్థలు పడుతూ విద్యార్థులు కుంబుర్లలోని పాఠశాలకు వెళ్లి విద్యనభ్యసిస్తున్నారని వాపోయారు. అలాగే కిముడుపల్లి పంచాయితీ వంతర్భ గ్రామంలో 30 మంది అంగన్‌వాడీ బాలలు విద్యను అభ్యసిస్తున్నప్పటికీ, అంగన్‌వాడీ భవనం లేకపోవడంతో వసతి సమస్య నెలకొందని గిరిజనలుఉ, జీఎస్‌యూ నాయకులు ఆందోళన చేశారు. అంగన్‌వాడీ కేంద్రం 20 ఏళ్లుగా ఉన్నా శాశ్వత భవనం లేకపోవడంతో అద్దె ఇంటిలో నిర్వహించాల్సి వస్తున్నదన్నారు. దీంతో చిన్నారులకు, గర్భిణులు, ఇబ్బందులు తప్పటం లేదన్నారు. ప్రభుత్వం స్పందించి ఈ సమస్యలను పరిష్కరించాలని కోరారు. జీఎస్‌యూ నాయకులు మాధవరావు, బాబూజీ, విశ్వనాథం, సత్తిబాబు, సింహాచలం, గీత, పూర్ణమ్మ, కామేశ్వరి, చంటి,మూర్తి, రాజు,వెంకట్, వీరన్నపడాల్, నగేష్, చిన్నారావు పాల్గొన్నారు.



రోడ్డు నిర్మాణం పూర్తి చేయాలని నిరసన తెలుపుతున్న గిరిజనులు

తుఫాన్‌పై ప్రజలు జాగ్రత్తలు పాటించాలి

» జీసీసీ చైర్మన్ కిడారి శ్రావణ్‌కుమార్



పాడేరు, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్ నేపథ్యంలో జిల్లాలోని ప్రజలు తగిన జాగ్రత్తలు పాటించి, సురక్షితంగా ఉండాలని జీసీసీ చైర్మన్ కిడారి శ్రావణ్‌కుమార్ సోమవారం ఒక ప్రకటనలో కోరారు. తుఫాన్ నేపథ్యంలో అధికార యంత్రాంగం సన్నద్ధంగా ఉందని, అందుకు అనుగుణంగా ప్రజలు సహకరించాలన్నారు. ప్రజలు అత్యవసర పరిస్థితుల్లో మాత్రమే బయటకు రావాలని, గెడ్డలు, వాగులు దాటవద్దని సూచించారు. అలాగే చెట్లు, విద్యుత్ స్తంభాలకు చేరువలో ఉండవద్దని, నిత్యావసర సరుకులకు ఇతర ఆహార పదార్థాలను సమకూర్చుకోవాలన్నారు. అలాగే ప్రభుత్వ సూచనలు పాటిస్తూ అవసరమైన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఏదైనా అత్యవసర పరిస్థితులు ఏర్పడితే కంట్రోల్ రూమ్‌లకు కాల్ చేయాలని శ్రావణ్‌కుమార్ సూచించారు.

అప్రమత్తంగా ఉండాలి : గిడ్డి ఈశ్వరి

మొంథా తుఫాన్ పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తెలుగు దేశం పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే గిడ్డి ఈశ్వరి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రమాదకరమైన గెడ్డలు, వాగులు దాటవద్దని, ఇళ్లలోనే సురక్షితంగా ఉండాలని ఆమె కోరారు. అధికారుల సూచనలు విధిగా పాటించాలన్నారు. ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా ప్రభుత్వం అన్ని ముందస్తు చర్యలు చేపట్టిందన్నారు.

ఎంటీఎస్ శ్రీనివాసరావు గుండెపోటుతో మృతి



మృతి చెందిన శ్రీనివాసరావు(ఫైల్)

కొయ్యూరు, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని శరభన్నపాలెం సబ్ యూనిట్ మలేరియా టెక్నికల్ అధికారి బాడా శ్రీనివాసరావు సోమవారం గుండెపోటుతో మృతి చెందారు. మండలంలోని శరభన్నపాలెం సబ్ యూనిట్ పరిధిలో మలేరియా టెన్నికల్ అధికారి శ్రీనివాసరావు పనిచేస్తున్నారు. ఆయన కుటుంబంతో నాతవరంలో నివాసముంటున్నారు. సోమవారం ఉదయం ఐదు గంటల సమయంలో ఛాతి నొప్పితో బాధపడుతూ మృతి చెందాడు. ఆయనకు భార్య, ఐదేళ్ల కుమారుడు ఉన్నాడు. ఆయన భౌతికగాయానికి జిల్లా మలేరియా అధికారి తులసి, జిల్లా కన్సల్టెంట్ శ్రీనివాసరావు, ఏఎంవో నీలకంఠం, చింతపల్లి ఎంటీఎస్ గుమ్మ యుగంధర్ నివాళి అర్పించి, కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.

శ్రీనివాసరావు కుటుంబాన్ని ఆదుకోవాలి

చింతపల్లి, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): గుండెపోటుతో మృతి చెందిన శరభన్నపాలెం మలేరియా టెన్నికల్ అధికారి శ్రీనివాసరావు కుటుంబాన్ని వైద్య ఆరోగ్యశాఖ ఆదుకోవాలని చింతపల్లి ఎంటీఎస్ గుమ్మ యుగంధర్ విజ్ఞప్తి చేశారు. సోమవారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ డీఎస్సీ ద్వారా ఎంపికైన మలేరియా టెక్నికల్ అధికారి శ్రీనివాసరావు 16ఏళ్లపాటు కాంట్రాక్టు పద్ధతిలో శరభన్నపాలెం సబ్ యూనిట్ పరిధిలో విధులు నిర్వహిస్తున్నాడన్నారు. ఆయన మరణం మలేరియా విభాగానికి తీరని లోటన్నారు. భార్య, కుమారుడుని ఆదుకోవాల్సిన బాధ్యత వైద్య ఆరోగ్యశాఖపై ఉందన్నారు. ఆయనకు ప్రభుత్వం నుంచి దహన ఖర్చులు సైతం అందజేయకపోవడం బాధాకరమన్నారు.

విద్యార్థులకు ఓపెన్ హౌస్



విద్యార్థులకు ఆయుధాల గురించి వివరిస్తున్న సీఐ, ఎస్‌ఐ

అరకులోయ, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): అరకులోయ పోలీస్ స్టేషన్‌లో సోమవారం ఓపెన్‌హౌస్ కార్యక్రమాన్ని నిర్వహించారు. సీఐ హిమగిరి, ఎస్‌ఐ గోపాలరావు విద్యార్థులకు ఓపెన్‌హౌస్ ప్రోగ్రాం గురించి వివరించారు. ఆయుధాలను ప్రదర్శించగా, విద్యార్థులను వాటిని పరిశీలించారు. వాటి వినియోగం గురించి సీఐ వివరించారు. అలాగే పోలీస్ స్టేషన్‌లో అధికారులు, సిబ్బంది విధులను విద్యార్థులకు వివరించారు.

డుంబ్రిగుడలో...

డుంబ్రిగుడ, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు ఆయుధాల పట్ల అవగాహన కలిగిఉండాలని ఎస్‌ఐ పాపినాయుడు సూచించారు. పోలీసు అమరవీరుల వారోత్సవాల్లో భాగంగా సోమవారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో బాలికల ఆశ్రమ పాఠశాల విద్యార్థినులకు ఓపెన్ హౌస్ కార్యక్రమం నిర్వహించారు. పోలీసుల విధులు, వారి బాధ్యతలను ఎస్‌ఐ వివరించారు.

ముంచంగిపుట్టులో ముసురు వాతావరణం

ముంచంగిపుట్టు, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): మండలంలో మొంథా తుఫాన్ కారణంగా సోమవారం ముసురు వాతావరణం నెలకొంది. ఉదయం నుంచి సాయంత్రం వరకు దపదఫాలుగా వర్షం కురిసింది. భారీగా ఈదురుగాలులు వీచాయి. సాయంత్రం నుంచి రాత్రి వరకు మోస్తరు వర్షం పడింది. భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని, గెడ్డ పరివాహక ప్రాంతాల్లో జీవనం సాగించే వారు అప్రమత్తంగా ఉండాలని ఎస్‌ఐ జె.రామక్రిష్ణ తెలిపారు.

ఏకలవ్యలో నీటి సమస్య పరిష్కరిస్తాం

» ఎన్‌ఎస్‌టీఎస్ కన్సల్టెంట్ కృష్ణారావు



పాఠశాలలో సమస్యలను అడిగి తెలుసుకుంటున్న కృష్ణారావు

ముంచంగిపుట్టు, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): ఏకలవ్య పాఠశాలలో నీటి సమస్య పరిష్కారానికి చర్యలు చేపడతామని నేషనల్ ఎడ్యుకేషన్ సొసైటీ ఏకలవ్య ఎన్‌ఎస్‌టీఎస్ కన్సల్టెంట్ జి.కృష్ణారావు చెప్పారు. మండలంలోని జోలాపుట్టు పంచాయతీ లబ్బూరు ఏకలవ్య పాఠశాలను సోమవారం ఆయన సందర్శించారు. పాఠశాల విద్యార్థులతో మాట్లాడి వారి బాధలను అడిగి తెలుసుకున్నారు. పాఠశాలలో నీటి సమస్య ఎక్కువగా ఉందని కొద్ది రోజులుగా వివిధ రూపాల్లో విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళన చేయడం, ఆ పాఠశాలను సందర్శించిన అధికారుల దృష్టికి విద్యార్థులు తీసుకువస్తున్న విషయం తెలిసిందే. దీంతో ఎన్‌ఎస్‌టీఎస్ కన్సల్టెంట్ కృష్ణారావు పాఠశాలలో నెలకొన్న నీటి సమస్యపై ఆరా తీశారు. నిరుపయోగంగా ఉన్న నీటి ట్యాంకులు, నీటి పథకాలను ఆయన పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రూ.40 లక్షలతో ఏకలవ్య పాఠశాలలో నీటి సౌకర్యం కల్పనకు ప్రతిపాదనలు పంపిస్తామని చెప్పారు. తాత్కాలికంగా ట్యాంకర్ల ద్వారా విద్యార్థులకు సరిపడే నీరు అందేలా చూస్తామన్నారు. త్వరగా నీటి సమస్య పరిష్కారం అయ్యే విధంగా చూడాలని విద్యార్థుల తల్లిదండ్రులు అతని దృష్టికి తీసుకువెళ్లగా, వీలైనంత తొందరలో సమస్య పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. తాత్కాలికంగా నీటి సమస్య తలెత్తకుండా చర్యలు చేపడుతున్నామని క్రిష్ణారావు చెప్పారు. ఈ కార్యక్రమంలో గురుకులం ఏసీడీ మూర్తి, పాఠశాల ప్రిన్సిపాల్ సుమన్, తదితరులు పాల్గొన్నారు.

గ్రామాలపై 'మొంథా' ప్రభావం


తుని-నర్సీపట్నం రూటులో గన్నవరంమెట్ట వద్ద చెట్లు తొలగిస్తున్న అధికారులు

గ్రామాలపై మొంథా తుఫాన్ ప్రభావం చూపుతోంది. ఉదయం నుంచి మబ్బులు కమ్ముకోగా, మధ్యాహ్నం తర్వాత వర్షాలు జోరందుకున్నాయి. దీంతో అన్ని మండలాల్లో అధికారులు అప్రమత్తమయ్యారు. విస్తృతంగా ముందస్తు చర్యలు చేపడుతున్నారు. ఇప్పటికే ముంపు ప్రాంతాల్లో పునరావాస కేంద్రాలను కూడా ఏర్పాటు చేశారు.

నర్సీపట్నం అర్బన్/చోడవరం/మాడుగుల/మాడుగుల రూరల్/గొలుగొండ/కృష్ణాదేవిపేట/నాతవరం/మాకవరపాలెం/చీడికాడ, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): జిల్లాల్లో నర్సీపట్నం, చోడవరం, మాడుగుల నియోజకవర్గాల్లోని పలు మండలాల్లో సోమవారం మధ్యాహ్నం నుంచి వర్షాలు పడుతున్నాయి. నర్సీపట్నం మండలంలోని నీలంపేట, గబ్బాడ, చెట్టుపల్లి, వేములపూడి, పెదబొడ్డేపల్లి గ్రామాల్లో వర్షం కురిసింది. దీంతో లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. తుఫాన్ నేపథ్యంలో కార్యాలయాల్లో అధికారులు కంట్రోల్ రూములు ఏర్పాటు చేశారు. అలాగే గొలుగొండ మండల కేంద్రంతో పాటు కృష్ణాదేవిపేట, ఏఎల్ పురం, పాత

జోరుగా వర్షాలు.. భయపెడుతున్న ఈదురుగాలులు

ముందస్తు చర్యలు చేపడుతున్న అధికారులు

కృష్ణాదేవిపేట, చోద్యం, నాగాపురం, కొంగశింగి, లింగంపేట, విప్పలపాలెం తదితర గ్రామాల్లో వర్షాలు పడుతున్నాయి. తుఫాన్ ప్రభావంతో గ్రామాల్లో వర్షంతో పాటు ఈదురుగాలులు వీస్తున్నాయి. కృష్ణాదేవిపేట వారపు సంత జనాలు లేక బోసిపోయింది. గ్రామీణ రహదారులు అధ్వానంగా మారాయి. బోడ్డేరు గెడ్డలు, వాగులు, చెరువుల్లో వర్షంనీటితో కళకళలాడాతున్నాయి. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచిస్తున్నారు. మాకవరపాలెం మండలంలోని గిడుతూరు, మల్లవరం, మాకవరపాలెం, పైడిపాల, బూరుగుపాలెం, తాడపాల, తామరం గ్రామాల్లో మధ్యాహ్నం వరకు చిన్నపాటి వర్షం పడినప్పటికీ, అనంతరం గాలులు వీస్తున్నాయి. చోడవరం మండలంలో సోమవారం ఉదయం నుంచి ముసురు వాతావరణం నెలకొంది. ఉదయం 11 గంటల వరకు జల్లులు పడ్డాయి. తరువాత మోస్తరుగా వర్షం కురిసింది. తుఫాన్‌తో భారీ వర్షాలు కురిసే ప్రమాదం ఉండడంతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు. మాడుగులలో ఉదయం 8 గంటల నుంచి ముసురు వాతావరణం నెలకొంది. మధ్యాహ్నం తర్వాత వర్షం


మాడుగుల ఘాట్ రోడ్డు జంక్షన్‌లో వర్షం


కృష్ణాదేవిపేట ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద కురుస్తున్న వర్షం

కురిసింది. అధికారులు తుఫాన్ హెచ్చరికలు జారీ చేయడంతో మాడుగులలో సోమవారం జరిగే వారపు సంతకు గిరిజనులు పెద్దగా రాలేదు. దీంతో సంత బోసిపోయింది. ఎడతెరిపి లేకుండా చిరుజల్లులు పడుతుండడంతో రాకపోకలకు ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. చీడికాడ మండలంలోని అన్ని గ్రామాల్లో తుఫాన్ ప్రభావంతో ఉదయం నుంచి ఎడతెరిపివ్వని వాన పడింది. దీంతో పశువులను రైతులు ఆరుబయట మేతకు తీసుకువెళ్లలేదు. అలాగే గ్రామాల్లో తుఫాన్ హెచ్చరికలతో ప్రజలు ఎక్కువగా బయటకు రాలేదు.

నాతవరం మండల వ్యాప్తంగా వర్షాలు పడుతున్నాయి. దీంతో నాతవరం ఉన్నత పాఠశాలను అధికారులు తుఫాన్ షెల్టర్‌గా ఏర్పాటు చేశారు. మండల ప్రత్యేకాధికారి మంగవేణి, తహశీల్దార్ వేణుగోపాల్, ఎంపీడీవో సత్యశ్రీనివాసు, ఎస్‌ఐ తారకేశ్వరరావు తదితరులు తుని-నర్సీపట్నం రూటులో గన్నవరంమెట్ట వద్ద వెర్రిగెడ్డకు అడ్డంగా ఉన్న చెట్లను ఎక్స్‌కవేటర్లతో తొలగించారు. గతంలో వరదలకు వెర్రిగెడ్డ రోడ్డుపై కారు ప్రమాదం జరిగి ముగ్గురు వ్యక్తులు చనిపోవడంతో, అధికారులు మొంథా తుఫాన్ ప్రభావంతో ఎటువంటి ప్రమాదాలు జరగకుండా ముందు జాగ్రత్తలు చర్యలు తీసుకున్నారు. అలాగే రెండు రోజులుగా తహశీల్దార్ వేణుగోపాల్ కార్యాలయంలోనే ఉండి తుఫాన్ ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారు.

ముంపు గ్రామాల్లో ముందస్తు చర్యలు

మాడుగుల, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్ కారణంగా ముంపు గ్రామాల్లో ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టామని తహశీల్దార్ కె.రమాదేవి చెప్పారు. పోతనపూడి గ్రామంలో ప్రజలను అత్యవసరంగా తరలించేందుకు అన్ని ఏర్పాట్లు చేశామన్నారు. వీరి కోసం కొండయ్యపాలెం పాఠశాలలో పునరావాస కేంద్రం ఏర్పాటు చేసినట్టు చెప్పారు. అలాగే ఒమ్మలి జగన్నాథపురం ప్రజల కోసం ఉన్నత పాఠశాలలోను, డి.గొటివాడ ప్రజలకు సాగరం పాఠశాలలోను ఉండేందుకు అనువుగా భోజన, వసతి ఏర్పాట్లు చేశామన్నారు. తుఫాన్ తీవ్రతను గమనించి ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, ఇళ్ల నుంచి బయటకు రావొద్దని ఆమె కోరారు. అత్యవసర సేవల కోసం 08934-224207, 9866883398 నంబర్లకు సంప్రదించాలని సూచించారు.

లోతట్టు గ్రామాల్లో నిరంతర నిఘా

రోలుగుంట, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): తుఫాన్ హెచ్చరికల నేపథ్యంలో లోతట్టు గ్రామాల్లో ఉద్యోగులతో నిరంతరం నిఘా ఉంచామని మండల ప్రత్యేకాధికారిణి నాగలక్ష్మి తెలిపారు. రెవెన్యూ కార్యాలయంలో సోమవారం అన్ని శాఖల అధికారులతో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ కంట్రోల్ రూం వద్ద పనిచేసే సిబ్బంది అప్రమత్తంగా ఉండాలన్నారు. ప్రజల నుంచి సమాచారాన్ని సంబంధింత శాఖల అధికారులకు వెంటనే తెలియజేయాలన్నారు. గిరిజన గ్రామాలు, లోతట్టు గ్రామాల్లో ఎటువంటి ఇబ్బందులు తలెత్తినా వెంటనే అప్రమత్తం కావాలన్నారు. వైద్యులు, సిబ్బంది 24/7 అందుబాటులోనే ఉండాలని సూచించారు. సమావేశంలో తహశీల్దార్ నాగమ్మ, ఎంపీడీవో నాగేశ్వరరావు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

సహాయ సిబ్బంది సిద్ధంగా ఉండాలి

బుచ్చెయ్యపేట, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): తుఫాన్ వల్ల ఎటువంటి ముప్పు వాటిల్లకుండా సహాయ సిబ్బంది సిద్ధంగా ఉండాలని తహశీల్దార్ ఎం.లక్ష్మి సూచించారు. విజయరామరాజుపేట, మంగళాపురం గ్రామాలను ముంపు ప్రభావిత ప్రాంతాలుగా గుర్తించామని, అక్కడ ప్రజలకు ప్రభుత్వ విద్యాలయాల్లో పునరావాస కేంద్రాలు ఏర్పాటు చేశామని చెప్పారు. వారికి ఎటువంటి అవసరం వచ్చిన సహాయం చేయడానికి సిబ్బందిని సిద్ధంగా ఉండాలని సూచించారు. అలాగే ప్రజల అత్యవసర సేవల కోసం కమాండ్ కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశామని, 08934294391 నంబర్‌ను సంప్రదించాలని తహశీల్దార్ తెలిపారు.

ఫ్రీ హోల్డ్‌పై నిషేధం తొలగించొద్దు

దేవరాపల్లి, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): అసైన్డ్ భూములపై ఉన్న ఫ్రీ హోల్డ్ నిషేధాన్ని తొలగించవద్దని ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు డి.వెంకన్న సోమవారం ఒక ప్రకటనలో కోరారు. ఈ భూములపై ఉన్న నిషేధాన్ని త్వరలోనే తొలగిస్తామని మంత్రివర్గ ఉప సంఘం ప్రకటించడంతో కబ్జాదారులకు తీపి కబురు అన్నారు. ఇది లక్షలాది మంది దళిత, గిరిజన, బలహీన వర్గాలకు చేదు కబురన్నారు. ఫ్రీ హోల్డ్‌పై నిషేధం తొలగిస్తే పెత్తందార్ల కబంద హస్తాల్లోకి పేదల భూములు వెళ్లిపోతాయన్నారు.

కేఎం పాలెంలో భజన కార్యక్రమం

దేవరాపల్లి, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కేఎం పాలెంలో గ్రామంలో సత్యసాయి బాబా శత జయంతి ఉత్సవాలను పురస్కరించుకొని సోమవారం వంద పాటల భజన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం అన్న సమారాధన ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షుడు కసిరెడ్డి అప్పలనాయుడు, జోన్ ఇన్‌చార్జి సిహెచ్‌వీ రవిశంకర్, సభ్యులు పెంటారావు, కన్నబాబు పాల్గొన్నారు.

వైసీపీ కోటి సంతకాల సేకరణ

గొలుగొండ, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎర్రవరం గ్రామంలో మెడికల్ కాలేజీ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా మాజీ ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేశ్ ఆధ్వర్యంలో సోమవారం కోటి సంతకాల సేకరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గణేశ్ మాట్లాడుతూ రాష్ట్రంలో గత ప్రభుత్వ హయాంలో మంజూరు చేసిన మెడికల్ కాలేజీలను ప్రైవేటీకరించవద్దని డిమాండ్ చేశారు. ఇందుకోసం కోటి సంతకాలు సేకరిస్తున్నట్టు చెప్పారు. ఈ కార్యక్రమంలో వైసీపీ నాయకులు కె.పాణిశాంతారాం, కిలపర్తి పెద్దిరాజు, కొల్లి సత్యనారాయణ, పత్తి రమణ పాల్గొన్నారు.

శివాలయాలకు కార్తీక శోభ


మాకవరపాలెం: భక్తులతో కిటకిటలాడుతున్న పైడిపాలెం శివాలయం


దేవరాపల్లి: తిమిరాం శివాలయంలో కార్తీక మాస పూజలు చేస్తున్న భక్తులు


రోలుగుంట: కుసర్లపూడిలో శివపార్వతుల వద్ద దీపాలంకరణ చేసిన దృశ్యం

నర్సీపట్నం, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): కార్తీక మాసం మొదటి సోమవారం శివాలయాలు భక్తులతో పోటెత్తాయి. శివ నామస్మరణతో ఆలయాలు మార్మోగాయి. నర్సీపట్నం బలిఘట్టం బ్రహ్మలింగేశ్వరస్వామి ఆలయంలో దర్శనానికి భక్తులకు రెండు గంటలకుపైగా సమయం పట్టింది. తెల్లవారు జాము నుంచే స్వామి దర్శనం కోసం క్యూ కట్టారు. ఆలయ ప్రాంగణం భక్తులతో కిక్కిరిసిపోయింది. క్యూలో ఉండి గర్భ గుడికి చేరుకోవడానికే రెండు గంటలు సమయం పట్టింది. అభిషేకాలు నిలిపేసి, గోత్ర నామాలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ధ్వజ స్తంభం, రావిచెట్టు, ఉసిరి చెట్టు వద్ద మహిళలు దీపారాధన చేశారు.


నర్సీపట్నం బ్రహ్మలింగేశ్వరస్వామి ఆలయంలో పూజలు


రావికమతం శివాలయంలో పూజలు చేస్తున్న భక్తులు

మాకవరపాలెంలో...

మాకవరపాలెం: మండలంలో శివాలయాలు కిటకిటలాడాయి. పెద్దమిల్లు సెంటరులోని వామలింగేశ్వర, గిడుతూరు గంగాధరశ్వర, పీపీ అగ్రహారంలోని అమృతేశ్వర స్వామి ఆలయాలు తెల్లవారు నుంచే కిక్కిరిసిపోయాయి. భక్తులు ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు.

రావికమతంలో...

రావికమతం: మండల కేంద్రంతో పాటు కొత్తకోట, మేడివాడ, కవ్వగుంటలో శివాలయాలు భక్తులతో కిటకిలాడాయి. వర్షం లెక్కచేయకుండా భక్తులు తెల్లవారు జాము నుంచే వెళ్లి అభిషేకాలు చేయించుకున్నారు. ధ్వజ స్తంభాల వద్ద దీపాలు వెలిగించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. రావికమతం శివ పంచాయతన ఆలయంలో లక్ష్మీనారాయణ, శ్రీనివాస శర్మ ఆధ్వర్యంలో హోమాలు నిర్వహించారు.


మాడుగుల: ఎం.కోడూరు శివాలయం వద్ద భక్తులు సందడి

రోలుగుంటలో...

రోలుగుంట: మండలంలోని ఆలయాలకు భక్తులు పోటెత్తారు. కుసర్లపూడి పాకలపాటి గురువు ఆశ్రమం, బుచ్చెంపేట మినీ కైలాసగిరి, రోలుగుంట కాశీవిశ్వేశ్వర మృత్యాంజయ ఆలయంలో కార్తీకమాస పూజలు చేశారు. కుసర్లపూడిలో శివపార్వుతుల వద్ద దీపాలంకరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇందులో భాగంగా జిల్లా స్థాయి భజన పోటీలను ఏర్పాటు చేశారు.

మాడుగులలో...

మాడుగుల/మాడుగుల రూరల్: మండల కేంద్రంలోని పలు శివాలయాల్లో కార్తీకమాస తొలి సోమవారం వేకువ జాము నుంచి ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహించారు. భీమలింగేశ్వర, స్వర్గ లింగేశ్వర, కృష్ణ భూపాలేశ్వర, ఉబ్బలింగేశ్వరస్వామి ఆలయాలకు వేకువజాము 3 గంటల నుంచి భక్తులు చేరుకొని ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహించారు. మరి కొంతమంది మహిళలు ఆలయ సమీపంలో ఉన్న నదీ ప్రవాహాలలో తలంటి స్నానమాచరించిన తర్వాత దీపారాధన చేశారు. అలాగే ఎం.కోడూరు, జంపెన, వీరవిల్లి అగ్రహారం, కేజేపురం ఇలా పలు గ్రామాల్లోని శివాలయాల్లో భక్తుల సందడి నెలకొంది

దేవరాపల్లిలో...

దేవరాపల్లి: మండలంలోని అన్ని శివాలయాల్లో కార్తీక మాస పూజలు నిర్వహించారు. తిమిరాం ఉమామహేశ్వర, దేవరాపల్లి వనదేవీశ్వర, చిననందిపల్లి, పెదనందిపల్లి, తెనుగుపూడి, బి.కింతాడ శివాలయాల్లో భక్తులు అభిషేకాలు, ప్రత్యేకంగా పూజలు చేశారు. పురోహితులు పాకల కామేశ్వరరావుశర్మ తదితరులు పాల్గొన్నారు.

రైవాడకు ప్రవేశం నిషేధిస్తూ హెచ్చరిక బోర్డులు


హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేస్తున్న తహశీల్దార్, ఎస్‌ఐ, డీఈ

దేవరాపల్లి, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): తుఫాన్ కారణంగా రైవాడ జలాశయానికి ప్రవేశం నిషేధిస్తూ సోమవారం హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేశారు. తహశీల్దార్ లక్ష్మీదేవి, ఎస్‌ఐ సత్యన్నారాయణ, డీఈఈ సత్యంనాయుడు జలాశయం వద్దకు వెళ్లి బోర్డులు పెట్టారు. జలాశయంలోకి చేపల వేటకు వెళ్ల వద్దని, పర్యాటకులు కూడా రాకూడదని ఈ సందర్భంగా వారు సూచించారు.

బీఎన్ రోడ్డులో ట్రాక్టర్ బోల్తా



బుచ్చెయ్యపేట, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బీఎన్ రోడ్డులో పోట్టిదొరపాలెం వద్ద సోమవారం ట్రాక్టర్ బోల్తా పడింది. రావికమతం నుంచి పామాయిల్ గెలలతో వడ్డాది వైపు వెళ్తున్న ఈ ట్రాక్టర్ పోట్టిదొరపాలెం వద్ద గుంతలో పడి అదుపు తప్పి తొట్టె బోల్తా పడింది. పామాయిల్ గెలలు రోడ్డుపై పడిపోయాయి. డ్రైవర్ ప్రమాదం నుంచి తప్పించుకున్నాడు.

'నిబంధనలు ఉల్లంఘించిన కాలేజీపై చర్యలు తీసుకోండి'

మాకవరపాలెం, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ నిబంధనలు ఉలంఘించిన ఇమ్మానియేలు కాలేజీపై చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ ప్రతినిధులు జనార్ధన్, సత్యనారాయణ, మోహన్, బార్గవ్, గంగా, లోవరాజు, తరుణ్ డిమాండ్ చేశారు. తుఫాన్ కారణంగా అనకాపల్లి జిల్లా కలెక్టరు కాలేజీలకు, పాఠశాలకు సోమవారం సెలవు ప్రకటన చేసినప్పటికీ, ఇమ్మానియేలు కాలేజీ యథావిధిగా కాలేజీ నిర్వహించిందన్నారు. అనకాపల్లి జిల్లాలో రెడ్ అలర్ట్ ప్రకటించినప్పటికీ క్లాసులు నిర్వహించిన కాలేజీపై జిల్లా కలెక్టర్ విచారణ చేయించి తగిన చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఆందోళన చేస్తామని హెచ్చరించారు.

తుఫాన్‌తో అధికారుల అప్రమత్తం

రావికమతం, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్‌పై అధికార యంత్రాంగం అప్రమత్తమైంది. ఇప్పటికే ముందస్తు సహాయక చర్యలు చేపడుతున్నది. ఆదివారం రాత్రికి రాత్రే తుఫాన్ తీవ్రతపై గ్రామాలలో విస్తృత ప్రచారం చేసి తుఫాన్‌పై ప్రజలకు అవగాహన కల్పించారు. కొత్తకోట, మేడివాడ, రావికమతం, చినపాచిల గ్రామాలలో విద్యాలయాలను పునరావాస కేంద్రాలుగా గుర్తించి అన్ని సౌకర్యాలు ఏర్పాటు చేశారు. సోమవారం ఉదయం నుంచి రాత్రి వరకూ ఎంపీడీవో మహేశ్, తహశీల్దార్ అంబేడ్కర్, డిప్యూటీ ఎంపీడీవో సీతారామ స్వామి, ఈపీడీసీఎల్ ఏఈ శ్రీనివాస్ గ్రామాలలో పర్యటించి ఏర్పాట్లను పర్యవేక్షించారు. విద్యుత్ సరఫరా ఆగితే జనరేటర్లును సిద్ధం చేసి తాగునీటి సరఫరా ఆగకుండా చర్యలు చేపట్టాలని కార్యదర్శులను ఎంపీడీవో ఆదేశించారు. వమ్మవరంలో శిథిలమైన తాటాకు పూరి గుడెసలో వర్షానికి కారిపోతుండంతో మంజేటి గంగరాజు, సత్యవతి కుటుంబాన్ని పాఠశాలలోకి తరలించారు. కొండ శిఖరంపైన నేరేడుబంద గ్రామ గర్భిణి రచ్చేలిని వైద్య సిబ్బంది నచ్చజెప్పి కొత్తకోట పీహెచ్‌సీలో చేర్పించారు. చెట్లు, స్తంభాలు కూలితే తక్షణమే తొలగించేందుకు కటర్లు, ఎక్స్‌కవేటర్లను సిద్ధం చేశారు.


ఎక్స్‌కవేటర్‌తో సిద్ధంగా ఉన్న ఉద్యోగులు


కొండ శిఖరంపై ఉన్న గర్భిణిని పీహెచ్‌సీలో చేర్పించేందుకు ఒప్పిస్తున్న వైద్య సిబ్బంది

వంటర్లపాలెంలో అధికారుల పర్యటన

మాడుగుల రూరల్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వంటర్లపాలెంలో గ్రామంలో సోమవారం అధికారులు పర్యటించారు. తుఫాన్ ప్రభావం వల్ల తేలికపాటి వర్షాలు పడుతున్నందున ముంపు ప్రభావిత గ్రామాలైన వంటర్లపాలెం, వీరవిల్లి అగ్రహారం గ్రామాలను మండల ప్రత్యేక అధికారి శివప్రసాద్, తహశీల్దారు రమాదేవి, ఎంపీడీవో కొంకి అప్పారావు, ఇరిగేషన్ జేఈ భావన సందర్శించారు. వంటర్లపాలెంలో తాచేరు గెడ్డను ఆనుకుని ఉన్న గట్టు కోతకు గురికాకుండా ఉండేందుకు ఇసుక బస్తాలను ఏర్పాటు చేయించారు. పెద్దేరు, తాచేరు వాగులు పొంగి ముంపు ఏర్పడితే గ్రామస్థులకు పునరావాసం కేంద్రాలుగా పాఠశాలలు, సచివాలయ భవనాలను ఏర్పాటు చేశారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఈ సందర్భంగా వారు సూచించారు.


వంటర్లపాలెంలో గ్రామస్థులతో మాట్లాడుతున్న అధికారులు

సబ్ జైలును సందర్శించిన సివిల్ జడ్జి


సబ్ జైలును పరిశీలిస్తున్న న్యాయమూర్తులు

నర్సీపట్నం, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): స్థానిక సబ్ జైలును జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్, విశాఖపట్నం సివిల్ జడ్జి (సీనియర్ డివిజన్) ఆర్.సన్యాసినాయుడు సోమవారం సందర్శించారు. ఈ సందర్భంగా రిమాండ్ ఖైదీలతో సమావేశం ఏర్పాటు చేసి, వారి యోగక్షేమాలపై ఆరా తీశారు. అలాగే జైలులో సౌకర్యాలు, భోజన సదుపాయం గురించి అడిగి తెలుసుకున్నారు. అనంతరం జైలు ఆవరణ పరిశీలించారు. ఈ కార్యమంలో నర్సీపట్నం సివిల్ జడ్జి పి.షియాజ్‌ఖాన్, సీఐ గోవిందరావు, ఎంఈవోలు తలుపులు, నాగేంద్ర పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న ఏవో సుగుణ

వరికి నష్టం లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలి

నాతవరం, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): తుఫాన్ ప్రభావంతో అధిక వర్షాలు కురుస్తుండడం వల్ల వరి పంటకు నష్టం వాటిల్లకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని మండల వ్యవసాధికారి సుగుణ సూచించారు. మండల కేంద్రంలోని పంచాయతీ కార్యాలయం వద్ద సచివాలయ ఉద్యోగులు, రైతులతో సోమవారం ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పంట పొలంలో కాలువలు తీసి నీటిని బయటకు పంపించాలని సూచించారు. అలాగే వరి పంటకు తెగుళ్ల వచ్చే ప్రమాదం ఉందని, ఇందుకోసం రైతులు వ్యవసాయాధికారుల సూచనలు తీసుకోవాలని చెప్పారు. ఈదురుగాలుల వల్ల వరి పంట పడిపోతే నిలబెట్టి కట్టాలని సూచించారు. ఈ సమావేశంలో మాజీ ఎంపీపీ పారుపల్లి కొండబాబు, పంచాయతీ కార్యదర్శి లాలం శేషు తదితరులు పాల్గొన్నారు.

సహాయక చర్యల్లో నిర్లక్ష్యం వద్దు

... 5వ పేజీ తరువాయి

చేసుకోవాలని పేర్కొన్నారు. రెండు, మూడు రోజుల్లో 'డెలివరీ డేట్' ఇచ్చిన గర్భిణులను వెంటనే సమీపంలోని ఆస్పత్రులకు తరలించాలని సూచించారు. విద్యుత్ సరఫరాలో ఇబ్బందులు తలెత్తితే వెంటనే సరిదిద్దడానికి సిబ్బంది అందుబాటులో ఉండాలన్నారు. జలాశయాలు, చెరువుల్లో నీటి మట్టాలను అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని, ఆయా సాగునీటి వనరులకు ముప్పు వాటిల్లకుండా అదనపు నీటిని దిగువకు విడుదల చేయాలని, మత్స్యకారులు సముద్రంలో వేటకు వెళ్లకుండా కట్టడి చేయాలని సూచించారు. ఎస్‌డీఆర్‌ఎఫ్, ఎన్‌డీఆర్‌ఎఫ్ బృందాలు సిద్ధంగా ఉన్నాయని, అవసరం మేరకు వారి సేవలను వినియోగించుకోవాలని వినయ్‌చంద్ చెప్పారు. ఈ సమావేశంలో డీఆర్‌ఓ సత్యనారాయణరావు, ఈపీడీసీఎల్ ఈఈ ప్రసాద్, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

తమలపాకు తోటలకు తుఫాన్ ముప్పు

... 5వ పేజీ తరువాయి

ఉద్యాన శాఖ అధికారి సాయిప్రియ సోమవారం మండలంలోని సత్యవరం, చుట్టుపక్కల గ్రామాల్లో పర్యటించి తమలపాకు తోటలను పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులతో మాట్లాడుతూ, భారీ వర్షాలు కురిస్తే తోటల్లో నీరు నిలువ లేకుండా ఎప్పటికప్పుడు బయటకు పోయేలా చూసుకోవాలని సూచించారు.



జలాశయాలకు వరద పోటు

- జలవనరుల శాఖ అధికారులు అప్రమత్తం
- అన్ని జలాశయాల నుంచి నదుల్లోకి నీరు విడుదల
- ఉధృతంగా ప్రవహిస్తున్న శారదా, తాండవ నదులు



తాండవ స్పిల్‌వే గేట్ల నుంచి నదిలోకి విడుదలవుతున్న నీరు

బంగాళాఖాతంలో ఏర్పడిన తుఫాన్ ప్రభావంతో రెండు, మూడు రోజుల పాటు జిల్లాలో భారీ వర్షాలు కురుస్తాయన్న వాతావరణ శాఖ హెచ్చరికలతో జలవనరుల శాఖ అధికారులు అప్రమత్తమయ్యారు. జలాశయాల్లోకి వరద నీరు పోటెత్తే అవకాశం వుండడంతో ముందు జాగ్రత్త చర్యలు చేట్టారు. సోమవారం తాండవ, రైవాడ, కోనాం, పెద్దేరు, కల్యాణపులోవ రిజర్వాయర్లలోకి వచ్చే వరద నీటి కంటే, స్పిల్‌వే గేట్ల నుంచి ఎక్కువ మోతాదులో నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. దీంతో శారదా, బొడ్డేరు, పెద్దేరు, తాండవ, సర్పా, వరహా నదుల్లో వరద ప్రవాహం పెరిగింది. నదులకు ఇరువైపులా వున్న గ్రామాల ప్రజలను అధికారులు అప్రమత్తం చేశారు.

దేవరాపల్లి, అక్టోబరు27 (ఆంధ్రజ్యోతి) మండలంలో రైవాడ జలాశయంలోకి సమ్మెద, పినకోట గెడ్డల నుంచి 1,200 క్యూసెక్కుల వదర నీరు చేరుతున్నది. గరిష్ఠ నీటిమట్టం 114 మీటర్లు కాగా, సోమవారం 112.2 మీటర్లుగా నమోదైంది. సాధారణంగా 113.5 మీటర్లు దాటితేనే స్పిల్‌వే గేట్లు ఎత్తుతారు. కానీ తుఫాన్ కారణంగా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు స్పిల్‌వే గేట్ల నుంచి 1,500 క్యూసెక్కుల నీటిని శారదా నదిలోకి విడుదల చేస్తున్నట్టు డీఈఈ సత్యంనాయుడు తెలిపారు.

పెద్దేరు నుంచి 300 క్యూసెక్కులు..

మాడుగుల రూరల్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): తుఫాన్ కారణంగా ఎగువ ప్రాంతంలో కురుస్తున్న వర్షాలతో మండలంలోని పెద్దేరు జలాశయంలోకి వరద నీరు చేరుతున్నది. గరిష్ఠ నీటిమట్టం 137 మీటర్లు కాగా సోమవారం 295 క్యూసెక్కుల ఇన్‌ఫ్లోతో 135.2 మీటర్లకు చేరింది. భారీ వర్షాలు కురుస్తాయన్న వాతావరణ శాఖ హెచ్చరికలతో జలాశయం అధికారులు అప్రమత్తమయ్యారు. సోమవారం రాత్రి ఎనిమిది గంటలకు జలాశయం మూడో గేటు ఎత్తి 300 క్యూసెక్కుల నీటిని నదిలోకి విడిచిపెడుతున్నారు. పెద్దేరు నదికి ఇరువైపులా వున్న గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఏఈ సుధాకర్‌రెడ్డి సూచించారు.

కల్యాణపులోవకు 250 క్యూసెక్కుల వరద

రావికమతం, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): 'మొంథా' తుఫాన్ కారణంగా భారీ వర్షాలు కురుస్తాయన్న వాతావరణ శాఖ హెచ్చరికలతో జలవనరుల శాఖ అధికారులు అప్రమత్తం అయ్యారు. కల్యాణపులోవ జలాశయం ఇప్పటికే పూర్తిగా నిండిపోగా.. వచ్చిన నీటిని వచ్చినట్టు దిగువకు విడుదల చేస్తున్నారు. రిజర్వాయర్ గరిష్ఠ నీటమట్టం 460 అగులుకాగా, సోమవారం సాయంత్రం 250 క్యూసెక్కుల వరద నీరు వచ్చిచేరుతున్నది. నీటిమట్టాన్ని 458 అడుగుల వద్ద నిలకడగా వుంచుతూ, స్పిల్‌వేలో రెండు గేట్లు ఎత్తి 250 క్యూసెక్కుల నీటిని సర్పా నదిలోకి విడుదల చేస్తున్నారు. దీంతో రావికమతం, రోలుగుంట, మాకవరపాలెం మండలాల్లో నదికి ఇరువైపులా వున్న గ్రామాల ప్రజలు అప్రమత్తంగా వుండాలని ఏఈ డి.సూర్య కోరారు.



కోనాం జలాశయం నుంచి బొడ్డేరు నదిలోకి విడుదలవున్న నీరు

తాండవ నుంచి 937 క్యూసెక్కులు విడుదల

నాతవరం, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): తుఫాన్ నేపథ్యంలో తాండవ రిజర్వాయర్ నుంచి అధికమొత్తంలో నీటిని దిగువకు విడుదల చేస్తున్నట్టు డీఈఈ అనురాధ తెలిపారు. గరిష్ఠ నీటిమట్టం 380 అడుగులు కాగా, సోమవారం 410 క్యూసెక్కుల ఇన్‌ఫ్లోతో నీటిమట్టం 377.8 అడుగులు వుంది. అయితే తుఫాన్ కారణంగా భారీ వర్షాలు కురిసే అవకాశం వుండడంతో సోమవారం మధ్యాహ్నం స్పిల్‌వే గేట్లు ఎత్తి 937 క్యూసెక్కుల నీటిని నదిలోకి విడిచిపెడుతున్నారు. నదికి ఇరువైపులా వున్న గ్రామాల ప్రజలు అప్రమత్తంగా వుండాలని డీఈఈ కోరారు.



కల్యాణపులోవ గేట్ల నుంచి విడుదలవుతున్న నీరు

కోనాం నుంచి 450 క్యూసెక్కులు విడుదల

చీడికాడ, అక్టోబరు 27 (ఆంధ్ర జ్యోతి): కోనాం జలాశయంలోకి 350 క్యూసెక్కుల వరద నీరు చేరుతున్నది. గరిష్ఠ నీటిమట్టం 101.25 మీటర్లు కాగా సోమవారం సాయంత్రం 99 మీటర్లుగా నమోదైంది. అయితే తుఫాన్ కారణంగా భారీ వర్షాలు కురిసే అవకాశం వుండంతో స్పిల్‌వే గేట్ల నుంచి 450 క్యూసెక్కుల నీటిని బొడ్డేరు నదిలోకి విడిచిపెడుతున్నట్టు జలాశయం ఏఈఈ సత్యనారాయణదొర తెలిపారు.

క్రైం... crime news

సైబర్ మోసంపై కేసు నమోదు

అనకాపల్లి టౌన్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): సైబర్ మోసానికి సంబంధించి అందిన ఫిర్యాదుపై కేసు నమోదు చేసినట్టు పట్టణ సీఐ జి.ప్రేమ్‌కుమార్ తెలిపారు. దీనికి సంబంధించి ఆయన వెల్లడించిన వివరాలిలా ఉన్నాయి. పట్టణంలోని గవరపాలెం దిబ్బవీధికి చెందిన కర్రి రమణబాబు ఎలక్ట్రీషియన్‌గా పనిచేస్తుంటారు. ఆగస్టు 17వ తేదీన ఇతని మొబైల్ ఫోన్‌కు ఒక లింక్ వచ్చింది. దానిని ఓపెన్ చేసి, అందులో అడిగిన వివరాలను తెలియజేశారు. అనంతరం ఆయన ఫోన్‌కు కాల్ వచ్చింది. తన పేరు ప్రియదర్శిని అంటూ ఒక అమ్మాయి పరిచయం చేసుకొని మాట్లాడింది. తాను సూచించిన సంస్థలో పెట్టుబడులు పెడితే కొద్ది కాలానికే రెట్టింపు వస్తుందని చెప్పింది. దీంతో రమణబాబు ఆగస్టు 17వ తేదీ నుంచి ఈ నెల ఆరో తేదీ వరకు దఫదఫాలుగా రూ.13.62 లక్షలు ఎస్‌బీఐ, హెచ్‌డీఎఫ్‌సీలోని తన బ్యాంకు ఖాతాల నుంచి ఆమెకు డిజిటల్ ట్రాన్స్‌ఫర్ చేశారు. తరువాత ఫోన్ చేస్తే ఆమె ఎత్తకపోవడంతో మోసపోయినట్టు గుర్తించి ఆదివారం రాత్రి పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు సీఐ తెలిపారు.

చెరువులో జారిపడి ఒకరి మృతి

సబ్బవరం, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నారపాడులో ఓ వ్యక్తి చెరువులో జారిపడి మృతిచెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం నారపాడు గ్రామానికి చెందిన నరవ అప్పలరాజు(45) కార్పెంటర్‌గా పనిచేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. ఆదివారం సాయంత్రం గ్రామానికి సమీపంలోని చెరువు వద్దకు బహిర్భూమికి వెళ్లాడు. ప్రమాదవశాత్తు కాలుజారి చెరువులో పడిపోయాడు. నిండుగా నీరు ఉండడంతోపాటు అప్పలరాజుకు ఈత రాకపోవడంతో నీటిలో మునిగిపోయాడు. ఈ సమయంలో అటుగా వెళుతున్న పల్లా గణేశ్ చూసి కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. స్థానికుల సహకారంతో చీకటిపడే వరకు చెరువులో గాలించినా ఆచూకీ లభించడంలేదు. అనంతరం పోలీసులకు సమాచారం ఇచ్చారు. సోమవారం ఉదయం పోలీసులు వచ్చి చెరువులో వెతగ్గా కొద్దిసేపటికి అప్పలరాజు మృతదేహం నీటిలో తేలింది. ఒడ్డుకు చేర్చి, పంచనామా అనంతరం పోస్టుమార్టం నిమిత్తం అనకాపల్లి ఎన్టీఆర్ ఆస్పత్రికి తరలించారు. భార్య దేవి సోమవారం ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్టు సీఐ జి.రామచంద్రరావు తెలిపారు.



నరవ అప్పలరాజు (ఫైల్ ఫొటో)

రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి మృతి

కశింకోట, అక్టోబర్ 27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బయ్యవరం కూడలి వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి చికిత్స పొందుతూ మృతిచెందాడు. ఆదివారం మధ్యాహ్నం రోడ్డు పక్కన నడుచుకుంటూ వెళుతున్న ఇద్దరు వ్యక్తులను వెనుక నుంచి వస్తున్న కారు ఢీకొన్నది. ఈ ప్రమాదంలో గాయపడిన విజయనగరం జిల్లా మర్రివలస గ్రామానికి చెందిన పరమేశ్ (52)ను విశాఖపట్నం కిమ్స్ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ సోమవారం మృతిచెందాడు. ఇతను బయ్యవరంలోని ఒక కంపెనీలో పని చేస్తున్నాడు. సీఐ అల్లు స్వామినాయుడు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రాష్ట్ర స్థాయి తైక్వాండో పోటీల్లో పతకాల పంట



పతకాలు సాధించిన క్రీడాకారులతో కోచ్‌లు

చోడవరం, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): అనంతపురంలో ఈ నెల 25, 26 తేదీల్లో నిర్వహించిన 42వ రాష్ట్రస్థాయి తైక్వాండో పోటీల్లో ఉమ్మడి విశాఖ జిల్లాకు చెందిన 12 మంది క్రీడాకారులు పతకాలు సాధించారు. పోమ్‌సే విభాగంలో చోడవరానికి చెందిన మింద్రాన హేమశ్రీ, జి.శశివర్ధన్, విశాఖకు చెందిన గండి రిషిత, అల్లూరి జిల్లాకు చెందిన పి.ప్రవల్లిక, సత్యవేణి, దివ్య, గోవిందమ్మలు 8 బంగారు పతకాలు, 3 రజత పతకాలు, ఒక కాంస్య పతకం సాధించారు. వీరు ఈ నెల 31 నుంచి నవంబరు 2 వరకు బెంగళూరులో నిర్వహించే జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. విజేతలను రాష్ట్ర తైక్వాండో అసోసియేషన్ అధ్యక్షుడు హర్షవర్ధన్ ప్రసాద్, ఉపాధ్యక్షుడు పల్లం మురళీకృష్ణ అభినందించారు.

రాష్ట్ర స్థాయి యోగా పోటీల్లో సత్తా

చోడవరం, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 25, 26 తేదీల్లో విశాఖపట్నంలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి యోగా పోటీల్లో స్థానిక పతంజలి యోగ కేంద్రానికి చెందిన సాధకులు సత్తా చాటారు. 8 నుంచి 40 సంవత్సరాలలోపు బాలలు, పురుషులు, మహిళల విభాగంలో మూడు బంగారు పతకాలు, మూడు రజతాలు, ఆరు కాంస్య పతకాలు లభించాయి. పతకాలు సాధించిన వారు డిసెంబరు 27 నుంచి 29 వరకు బాపట్లలో నిర్వహించనున్న జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యారని యోగా అసోసియేషన్ రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడు పుల్లేటి సతీశ్ తెలిపారు. పోటీల్లో సత్తాచాటిన యోగా సాధకులను స్థానిక యోగా కేంద్రం చైర్మన్ అశోక్, ఉషోదయ విద్యాసంస్థల చైర్మన్ జెర్రిపోతుల రమహాజీలతో పాటు, పలువురు ప్రముఖులు అభినందించారు.



రాష్ట్ర స్థాయి యోగా పోటీల్లో పతకాలు సాధించిన యోగా సాధకులు

చోరీ కేసులో ముద్దాయికి నాలుగు నెలల జైలుశిక్ష

అనకాపల్లి టౌన్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): పట్టణ పోలీస్‌స్టేషన్ పరిధిలోని కొత్తూరులో చోరీకి పాల్పడిన ముద్దాయికి న్యాయమూర్తి నాలుగు నెలలపాటు సాధారణ జైలు శిక్ష విధించినట్టు పట్టణ సీఐ ప్రేమ్‌కుమార్ తెలిపారు. కొత్తూరు గ్రామంలోని మోసూరి వెంకటలక్ష్మి ఇంట్లో, మద్దాలవారివీధిలో తులసీరాణి ఇంట్లో ఇటీవల చోరీలు జరిగాయి. బాధితుల ఫిర్యాదు మేరకు పోలీసులు అదే గ్రామంలో మొల్లివారివీధికి చెందిన కోన రాకేశ్‌ను అరెస్టు చేశారు. సోమవారం కోర్టులో హాజరుపరచగా... నేరం రుజువు కావడంతో ఫస్ట్ క్లాస్ ఏజేసీజే / 11వ ఏఎంఎం కోర్టు మెజిస్ట్రేట్ ఎ.రమేశ్ నాలుగు నెలల సాధారణ జైలు శిక్ష విధిస్తూ తీర్పు చెప్పారు.

తుఫాన్‌కు ప్రాణ, ఆస్తి నష్టం జరగనివ్వొద్దు

- లోతట్టు ప్రాంతాల ప్రజలను పునరావాస కేంద్రాలకు తరలించాలి
- అధికారులకు కలెక్టర్ ఆదేశం



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ విజయకృష్ణన్. పక్కన ఎస్పీ తుహిన్ సిన్హా, జేసీ జాహ్నవి. హాజరైన వివిధ శాఖల అధికారులు

అనకాపల్లి, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): 'మొంథా' తుఫాన్ కారణంగా ఎటువంటి ప్రాణ, ఆస్తి నష్టం జరగకుండా ముందస్తు జాగ్రత్తలు చేపట్టాలని కలెక్టర్ విజయకృష్ణన్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో ఎస్పీ తుహిన్ సిన్హాతో కలిసి అధికారులు, మండల ప్రత్యేకాధికారులతో సమావేశం నిర్వహించారు. తుఫాన్ ముందస్తు జాగ్రత్త చర్యలు, పునరావాస కేంద్రాల్లో ఏర్పాట్లపై సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, తుఫాన్ ప్రభావిత గ్రామాల ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించాలన్నారు. తుఫాన్ షెల్టర్లతోపాటు అవసరమైతే పాఠశాలలు, కళాశాలలు, ఇతర ప్రభుత్వ భవనాలను పునరావాస కేంద్రాలుగా వినియోగించాలని సూచించారు. పునరావాస కేంద్రాలకు మూడు రోజులకు సరిపడే ఆహార సామగ్రిని తరలించాలని సూచించారు. ఆహారాన్ని వండి వడ్డించాలని, చిన్నపిల్లలు ఉంటే పాలు అందజేయాలన్నారు.

ఎస్పీ తుహిన్ సిన్హా మాట్లాడుతూ, జిల్లాకు కేటాయించిన ఎస్‌డీఆర్‌ఎఫ్ బృందాన్ని పాయకరావుపేటలో, ఎన్‌డీఆర్‌ఎఫ్ బృందాన్ని అనకాపల్లిలో అందుబాటులో ఉంచామని తెలిపారు. మరో బృందాన్ని జిల్లాకు పంపాలని ప్రభుత్వాన్ని కోరినట్టు చెప్పారు. లోతట్టు ప్రాంతాల్లోని ప్రజలను పునరావాస కేంద్రాలకు తరలించే క్రమంలో ఇబ్బందులు ఎదురైతే పోలీసుల సహకారం తీసుకోవాలన్నారు. సమావేశంలో జేసీ జాహ్నవి, డీఆర్‌ఓ సత్యనారాయణరావు, తదితరులు పాల్గొన్నారు.

హడలెత్తిస్తున్న తుఫాన్

... 5వ పేజీ తరువాయి

చేసినట్టు ఈపీడీసీఎల్ ఎస్‌ఈ ప్రసాద్ సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అనకాపల్లి: 9490610023, కశింకోట : 8333811271, 8333811272, నర్సీపట్నం: 9491030723 ఫోన్ నంబర్లను అందుబాటులో వుంచారు.

విస్తారంగా వర్షాలు

జిల్లాలో సోమవారం ఉదయం 8.30 గంటల నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు 19.4 మిల్లీ మీటర్ల సగటు వర్షపాతం నమోదైంది. కొన్నిచోట్ల మోస్తరు వర్షం కురవగా, మరికొన్నిచోట్ల భారీ వర్షం కురిసింది. అత్యధికంగా పరవాడ మండలంలో 50.6 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. సబ్బవరం మండలంలో 38.8 మిల్లీమీటర్లు, అచ్యుతాపురంలో 32.6, మునగపాకలో 32.4, అనకాపల్లిలో 28.6, ఎలమంచిలిలో 28.6, కె.కోటపాడులో 27.8, రాంబిల్లిలో 24.6, కశింకోటలో 23.2, చోడవరంలో 16.8, రావికమతంలో 16.2, నక్కపల్లిలో 15.6, కోటవురట్లలో 15.4, చీడికాడలో 14.6, ఎస్.రాయవరంలో 14.4, పాయకరావుపేటలో 11.6, నర్సీపట్నంలో 11.2, మాకవరపాలెంలో 10.6 మాడుగులలో 10.4, రోలుగుంటలో 10.2, నాతవరంలో 7.2 గొలుగొండలో 5.6, దేవరాపల్లిలో 4.2 మిల్లీమీటర్ల వర్షం కురిసింది. సాయంత్రం ఆరు గంటల తరువాత వర్ష తీవ్రత పెరిగింది. ఈదురు గాలులు కూడా మొదలయ్యాయి. తుఫాన్ కారణంగా రాత్రి ఏడు గంటల నుంచే రహదారులపై జన సంచారం తగ్గిపోయింది. వాణిజ్య, వ్యాపార సంస్థలను త్వరగా మూసివేశారు.

అనకాపల్లి డిపో నుంచి పలు బస్సులు రద్దు

అనకాపల్లి టౌన్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి) : తుఫాన్ కారణంగా అనకాపల్లి నుంచి నడిచే పలు బస్సు సర్వీసులను రద్దు చేసినట్టు డిపో మేనేజర్ అనుమశ్రీ తెలిపారు. సోమ, మంగళవారాల్లో జోలాపుట్టు బస్సులను, తంతడి, కె.కొత్తపల్లి, దేవరాపల్లి, మాడుగుల, చోడవరం, రావికమతం, తట్టబంద నైట్ హాల్ట్ బస్సులను రద్దు చేశామన్నారు. విశాఖపట్నం, విజయనగరం బస్సులను ప్రయాణికుల రద్దీకి అనుగుణంగా నడుపుతున్నట్టు చెప్పారు.

నర్సీపట్నం డిపో నుంచి..

నర్సీపట్నం, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి) : తుఫాన్ ప్రభావంతో ముందు జాగ్రత్తగా ఏజెన్సీ సర్వీసులతో పాటు హైదరాబాద్, విజయవాడ, కాకినాడ సర్వీసులను రద్దు చేశామని నర్సీపట్నం డిపో మేనేజర్ ధీరజ్ తెలిపారు. మంగళ, బుధవారాల్లో సీలేరు, దేవరాపల్లి, గుమ్మరేవుల, మొండిగెడ్డ, మారేడుమిల్లి బస్సులను రద్దు చేశారు. చింతపల్లికి ఆరు బస్సులకుగాను రెండు బస్సులను రద్దు చేశారు.

శారదా నది పరవళ్లు

అనకాపల్లి టౌన్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): అనకాపల్లి పట్టణం వద్ద శారదా నది ఉధృతంగా ప్రవహిస్తున్నది. ఎగువ ప్రాంతాల్లో వర్షాలు కురుస్తుండడం, పలు జలాశయాల నుంచి నీటిని విడుదల చేస్తుండడంతో నదిలో ఒక్కసారిగా వరద ప్రవాహం పెరిగింది. తుఫాన్ కారణంగా రెండు, మూడు రోజులపాటు భారీ వర్షాలు కురుస్తాయని అధికారులు చెబుతుండడంతో శారదా నదిలో వరద ఉధృతి మరింత పెరుగుతుందని భావిస్తున్నారు. శారదా నది ఉధృతంగా ప్రవహిస్తున్నందున భక్తులు ఎవరూ కార్తీక స్నానాల కోసం నదిలోకి దిగవద్దని అధికారులు సూచించారు.



ఉధృతంగా ప్రవహిస్తున్న శారదా నది

చికెన్ ధరలు	
బ్యాగ్	రూ.లలో
రైతు ధర	115.00
లైవ్ ధర	135.00
విత్ స్కిన్	240.00
స్కిన్ లెస్	250.00

కోడి గుడ్లు (నెక్)	
వంద గుడ్లు	రూ.లలో
విశాఖపట్నం	565
విజయనగరం	569
శ్రీకాకుళం	569